ప్రజాశక్తి

సోమవారం 26 జూన్ 2023

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

పెంచలేదంటూనే పోటు

◆ ఐదు రకాల ఛార్జీలతో మోత ◆ వినియోగదారులపై పెరుగుతున్న విద్యుత్ భారం

◆ దళిత మహిళలకు వర్తించని ఉచితం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, పరవాడ, బుచ్చెయ్యపేట విలేకరులు

ఉచిత విద్యుత్‌కు నోచుకోని దళిత మహిళ పొట్ల పైడమ్మ

విద్యుత్ భారం పడిన దుకాణదారుడు రాజు

బుచ్చెయ్యపేట మండలం చిన్నప్పన్నపాలెం జంక్షన్‌లో చిన్న షాపు పెట్టుకుని కుటుంబాన్ని పోషించు కుంటున్నాడు చల్ల రాజు. సర్వీస్ నెంబర్ 1156340083000423 షాపులో ఒక ఫ్యాన్, లైటు, ఫ్రిజ్ ఉన్నాయి. ఏప్రిల్‌కు ముందు వరకూ నెలకు రూ.300 వచ్చిన కరెంట్ బిల్లు ప్రస్తుతం రూ.700కు పైగా వస్తోంది. ఆయన ఈ ఏడాది మే 4 నుంచి జూన్ 2 వరకూ 65 యూనిట్ల విద్యుత్ వినియోగించినందుకు రూ.384 చెల్లిస్తే సరిపోతుంది. కానీ ప్రభుత్వం విధించిన ట్రూఅప్ ఛార్జీ, ఇంధన సర్దుబాటు ఛార్జీ, సర్ ఛార్జీ, ఫిక్స్‌డ్ ఛార్జీ, ఎలక్ట్రిసిటీ డ్యూటీతో పాటు మరో రూ.361 కలిపి రూ.746 బిల్లు వచ్చింది.

పరవాడ మండల కేంద్రంలోని ఎస్‌సి కాలనీలో సర్వీస్ నెంబర్ 1171778895003969కు చెందిన దళితురాలు పొట్ల పైడమ్మకు మేలో 171 యూనిట్లకు విద్యుత్ బిల్లు రూ.868 వచ్చింది. ఈ బిల్లులో విద్యుత్ వినియోగ ఛార్జీ రూ.693కాగా, అదనంగా ఫిక్స్‌డ్ ఛార్జీ రూ.10, కస్టమర్ ఛార్జీ రూ.50, సర్ ఛార్జీ రూ.25, ఇంధన ఛార్జీ రూ.80, ఇడి రూ.10ని ప్రభుత్వం విధించింది. దళితులు వినియోగించే రెండు వందల యూనిట్లలోపు గృహ విద్యుత్‌ను ఉచితంగా ప్రభుత్వం సరఫరా చేయాల్సివుంది. కానీ పైడమ్మ ప్రతి నెలా రూ.800 నుంచి వెయ్యి రూపాయల వరకు బిల్లు చెల్లిస్తోంది. వీరిద్దరిపైనే కాదు ఉమ్మడి విశాఖ జిల్లాలోని పెక్కు మందిపై విద్యుత్ ఛార్జీల భారం ఏదో ఒక రూపాన పడుతోంది.

ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలకు డిమాండ్ ఛార్జీలు మినహా మిగిలిన కేటగిరీ వినియోగదారులపై ఛార్జీలు పెంచడంలేదని ఎపి విద్యుత్ నియంత్రణ మండలి ప్రకటించినా.. గృహ విద్యుత్ వినియోగదారుల నుంచి వివిధ రూపాల్లో ఛార్జీలు వసూలు చేస్తోంది. విద్యుత్ వినియోగ బిల్లులకు సమానంగా మిగతా 2లో..

అభివాదం చేస్తున్న అఖిలపక్ష రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు

పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలి

◆ 30న ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ల వద్ద నిరసన

◆ అఖిలపక్ష రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో నేతలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విద్యుత్ సంస్కరణల పేరుతో కేంద్ర ప్రభుత్వం చేసిన కుట్రలకు తలొగ్గిన ఎపి ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై మోయలేని భారం మోపుతోందని, విద్యుత్ ఛార్జీల భారం నానాటికీ పెరిగిపోతోందని సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, టిడిపి, ఎంసిపిఐ, సిపిఐ ఎంఎల్ (న్యూ డెమోక్రసీ) తదితర పార్టీలు, ప్రజా సంఘాల నేతలు అన్నారు. ఈ క్రమంలో పెంచిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలంటూ ఈ నెల 30న విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మిగతా 2లో..

కొనసాగుతున్న రైళ్ల రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఖరగ్‌పూర్ డివిజన్‌లోని ఖరగ్‌పూర్-భద్రక్ సెక్షన్‌లోని బహనాగా బజార్ స్టేషన్‌లో ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా జూన్ 26, 28 తేదీలలో 10 రైళ్లను రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో జూన్ 26న 18045 షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 18046 హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 22841 సంత్రాగచ్చి - తాంబరం మిగతా 2లో..

వైసిపి పాలనలో అభివృద్ధి గాలికి..

▶ వార్త 8లో..

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఉధృత ఉద్యమం

▶ వార్త 2లో..

చెత్త సేకరణ ఛార్జీలు నిలుపుచేయాలని ధర్నా

▶ వార్త 4లో..

బడి బస్సుల భద్రతపై దృష్టి

◆ నిబంధనలు అతిక్రమించిన యాజమాన్యాలపై కఠిన చర్యలు

◆ 'ప్రజాశక్తి'తో అనకాపల్లి జిల్లా రవాణా శాఖ అధికారి ఎం.వీర్రాజు

ప్రజాశక్తి - అనకాపల్లి

పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమైన నేపథ్యంలో బస్సుల భద్రతపై దృష్టి సారించినట్లు అనకాపల్లి జిల్లా రవాణా శాఖాధికారి ఎం.వీర్రాజు తెలిపారు. నిబంధనలు పాటించిన వారికే అనుమతులు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. తనను కలిసిన 'ప్రజాశక్తి'కి బడి బస్సుల భద్రతపై ఆయన పలు విషయాలు వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

జిల్లాలో బడి బస్సులు ఎన్ని తిరుగుతున్నాయి ?

అనకాపల్లి డివిజన్‌లో 302 బస్సులు, నర్సీపట్నం డివిజన్‌లో 170 బస్సులు వెరసి 472 బస్సులు జిల్లాలో తిరుగుతున్నాయి.

అన్ని బస్సులూ సమర్థవంతంగా పనిచేస్తున్నాయా ?

ఇంత వరకూ 350 బస్సులు ఫిట్‌నెస్ కోసం వచ్చాయి. ఇంకా 122 బస్సులు ఫిట్‌నెస్ కోసం రావాల్సి ఉంది. వారందరికీ ఫోన్ల ద్వారా సమాచారం తెలియజేశాం. ఫిట్‌నెస్ లేకుండా రోడ్డుపై బస్సులు తిరిగితే కేసులు నమోదు చేస్తాం. రెండు సంవత్సరాలుగా వాడని 30 నుంచి 40 బస్సులు ఉన్నాయి. వాటిని కూడా ఫిట్‌నెస్‌కు తీసుకురావాలని యాజమాన్యాలకు చెప్పాం. అటువంటి బస్సులు రోడ్డుపై తిరిగితే ఒక్కో బస్సుకు రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తాం.

ఫిట్‌నెస్‌కు సంబంధించి ఏమైనా కేసులు నమోదు చేశారా ?

గత ఏడాది 30 నుంచి 40 కేసులు చేశాం. ఈ ఏడాది సోమవారం నుంచి ఫిట్‌నెస్‌కు రాని బస్సులను చెక్ చేస్తాం.

బస్సుల ఫిట్‌నెస్ విషయంలో ఎటువంటి

మొదటి పేజీ తరువాయి..

పెంచలేదంటూనే పోటు

ఇతర ఛార్జీలు తోడవడంతో కట్టలేని స్థితిలోకి వినియోగదారులు నెట్టబడ్డారు. గృహ విద్యుత్ టారిఫ్ పెంచకపోయినా ఇతర రూపాల్లో ప్రతి నెలా వివిధ పన్నుల రూపంలో వినియోగదారుల నుంచి ప్రభుత్వం డబ్బులు వసూలు చేస్తోంది. ప్రభుత్వం వివిధ ఛార్జీల రూపంలో వసూలు చేస్తున్న విద్యుత్ బిల్లులతో వినియోగాన్ని బట్టి భారం పడుతోంది. ఈ భారం ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో దాదాపు 17.50 లక్షల ఎల్‌టి వినియోగదారులు, 1748 హెచ్‌టి సర్వీసు వినియోగదారులపై ఏదో మేరకు పడుతూనేవుంది. పైడమ్మ వలే అర్హత కలిగిన ఎస్‌సి గృహ విద్యుత్ వినియోగదారులకు ఉచిత విద్యుత్ సరఫరా వర్తించనప్పటికీ, ఇటువంటి వారిని గుర్తించి అమలుచేయకుండా ఉచిత విద్యుత్ భారం తగ్గించుకోవాలని ప్రభుత్వం చూస్తోంది. వాడిన విద్యుత్ యూనిట్‌కు గతంలో ఆరు పైసలు వసూలు చేసిన ప్రభుత్వం 2022 ఏప్రిల్ నుంచి రూపాయికి పెంచింది. దీంతో గృహ వినియోగదారులు మినహా మిగిలిన కేటగిరీ వినియోగదారులపై విపరీతమైన భారం పడుతోంది.

బడి బస్సుల భద్రతపై దృష్టి

నియమ నిబంధనలు ఉన్నాయి ?

బస్సుల ఫిట్‌నెస్ విషయంలో నిబంధనలు ఉన్నాయి. ప్రతి బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థుల జాబితా ఉండాలి. డ్రైవర్ వయసు 55 సంవత్సరాలలోపు ఉండాలి. బస్సులో అటెండర్, ప్రాథమిక చికిత్స కిట్టు, ఫైర్ స్టేషన్ అనుమతి, అత్యవసర సమయంలో ఎగ్జిట్, విద్యార్థుల బ్యాగులు పెట్టుకునేందుకు అరలు, విద్యార్థులు బస్సు ఎక్కేందుకు అనువుగా మెట్ల నిర్మాణం, వాహనం కండిషన్‌లో ఉండడం వంటి నిబంధనలు ఉన్నాయి. వీటిని అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తాం. బస్సుల ఫిట్‌నెస్ విషయంలో ఈ నెల 26 నుంచి స్పెషల్ డ్రైవ్ చేపడతాం.

కొనసాగుతున్న రైళ్ల రద్దు

ఎక్స్‌ప్రెస్, 07046 సికింద్రాబాద్ – దిబ్రూగర్ స్పెషల్, 07030 సికింద్రాబాద్ – అగర్తల స్పెషల్, 22856 తిరుపతి – సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్, 22878 ఎర్నాకులం – హౌరా ఎక్స్‌ప్రెస్, 22863 హౌరా – ఎస్‌ఎంవి బెంగళూరు ఎక్స్‌ప్రెస్, 00636 అగర్తల – ఎస్‌ఎంవి బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌లను, జూన్ 28న 22864 ఎస్‌ఎంవి బెంగళూరు – హౌరా ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలి

తెలిపారు. విద్యుత్ ఛార్జీల పెంపుపై ఆదివారం అఖిలపక్ష రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నష్టాలు వస్తున్నాయనే సాకుతో ఇప్పటికే ట్రూఅప్ ఛార్జీల పేరుతో జనం నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్న విద్యుత్ పంపిణీ సంస్థలు తాజాగా మరోసారి గుట్టు చప్పుడు కాకుండా జనంపై మరో భారాన్ని మోపాయని అన్నారు. దాదాపు 15 నెలల కాలంలోనే రకరకాల పేర్లతో మూడు సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిన ప్రభుత్వం తాజాగా నాలుగోసారి కొత్త భారం మోపిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తాజా ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నెలనెలా ట్రూఅప్ విధానాన్ని మే నెల నుంచే అమల్లోకి తీసుకురావడంతో జూన్ నెలలో ప్రతి వినియోగదారుడికీ ఇంట్లో కరెంటు వాడుకోకున్నా షాక్ కొట్టేలా బిల్లులు వచ్చాయన్నారు. విద్యుత్ నియంత్రణ మండలి అనుమతి లేకుండానే డిస్కంలు నేరుగా వినియోగదారులపై భారాలు మోపొచ్చని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలకు ఎపి ప్రభుత్వం ఆమోదం తెలపడంతో ఈ ఛార్జీల వసూళ్లు మొదలయ్యాయన్నారు. అందులో భాగంగానే ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో యూనిట్‌కు 40 పైసలు చొప్పున కొత్త భారాన్ని వినియోగదారులపై మోపి వసూలు చేస్తున్నాయన్నారు. మే నెలకు సంబంధించిన బిల్లుల్లో కొత్తగా కలిసిన ఛార్జీల కారణంగానే సాధారణం కన్నా రెండింతలు అధికంగా బిల్లులు వచ్చాయన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థలు ట్రూ అప్ పేరుతో రూ.2,900 కోట్లను 2022 ఆగస్టు నుంచి వసూలు చేస్తున్నాయన్నారు. ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రూ.3,083 కోట్లను వసూలు చేయడం ప్రారంభించాయన్నారు. ఇలా 8 నెలల కాలంలో రెండుసార్లు రూ.5,983 కోట్ల భారం మోపాయన్నారు. ఇప్పుడు కొత్తగా తీసుకొచ్చిన ఇంధన సర్దుబాటు ఛార్జీలతో నెలకు రూ.280 కోట్లు, ఏడాదికి సుమారు రూ.3 వేల కోట్ల భారం ప్రజలపై పడనుందన్నారు. దీంతో వినియోగదారుడు నెలనెలా వాడిన విద్యుత్‌తో పాటు ట్రూఅప్, ఇంధన సర్దుబాటు ఛార్జీలకు 15 శాతం అదనంగా చెల్లించాల్సి వస్తోందన్నారు. ఉదాహరణకు మధ్యతరగతి వినియోగదారుడు నెలకు 489 యూనిట్ల విద్యుత్ వాడితే ఇప్పుడున్న ఎలక్ట్రిసిటీ స్లాబుల ప్రకారం బిల్లు రూ.3416 అవుతుంది. దీనికి ఫిక్స్‌డ్, కస్టమర్ ఛార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, సర్ ఛార్జీలు కలిపితే రూ.3575 అవుతుందని, ఈ బిల్లు ట్రూ అప్ రూ.55.70, పాత ఇంధన సర్దుబాటు ఛార్జీలు రూ.79.20, కొత్త ఇంధన సర్దుబాటు ఛార్జీలు రూ.213.60 కలుపుకుని వస్తోందన్నారు. రూ.200 వరకు విద్యుత్ బిల్లులు చెల్లించిన పేద తరగతి ఇకపై సుమారు రూ.800 వరకూ విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వస్తుందన్నారు. వినియోగదారుల నుంచి మే నెలలో వాడిన విద్యుత్‌కు అదనంగా యూనిట్‌కు 40 పైసలు చొప్పున డిస్కంలు వసూలు చేయడంతో సుమారు రూ.280 కోట్ల భారం పడిందన్నారు. ఇప్పటికే 100 యూనిట్లకు ఎపిఎస్‌పిడిసిఎల్ వినియోగదారులు రూ.43, ఇపిడిసిఎల్ వినియోగదారులు. రూ.26, సిపిడిసిఎల్ వినియోగదారులు రూ.42 చొప్పున చెల్లిస్తున్నారన్నారు. ఇప్పుడు కొత్త ఛార్జీలతో ఎస్‌పిడిసిఎల్ వినియోగదారులు 100 యూనిట్లకు రూ.83, ఇపిడిసిఎల్ పరిధిలో వినియోగదారులు రూ.66, సిపిడిసిఎల్ వినియోగదారులు రూ.82 చొప్పున చెల్లించాలన్నారు. ఇవి రానున్న రోజుల్లో మరింతగా పెరిగి భారం అవుతాయన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపును వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఆందోళనలకు సిద్ధమవ్వాల్సి ఉందన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు సిఎంగా ఉండగా విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ చేపట్టిన ఉద్యమం తరహాలో రానున్న రోజుల్లో వైసిపి ప్రభుత్వంపై తిరుగుబాటుకు సిద్ధమవ్వాలన్నారు. ఈ నెల 30న తలపెట్టిన ఆందోళనలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, ఎం.పైడిరాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆరేటి మహేష్, మూర్తి యాదవ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గొంప గోవిందరాజు, సిపిఐ (ఎంఎల్) నాయకులు వై.కొండయ్య, ఎంసిపిఐ నాయకుడు కె.శంకర్రావు, కాంగ్రెస్ నాయకులు ఎస్.సుధాకర్, కె.చినబాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఎ.విమల, ఎఐటియుసి నాయకులు జిఎస్‌జె.అత్చుతరావు, ఎస్‌కె.రెహమాన్, ఎం.మన్మధరావు, సిహెచ్.కాసుబాబు, నెయ్యల నాగభూషణం, కూడా వజ్రం, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి జి.రాంబాబు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు, ఇన్సాఫ్ నాయకురాలు ఎంఎ.బేగం, పౌర ప్రజా సంఘాల నాయకులు పి.చంద్రశేఖర్, డి.ఏడుకొండలు పాల్గొన్నారు.

చంద్రబాబు క్రైస్తవులకు చేసిందేమీ లేదు

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : మూడుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు నాయుడు క్రైస్తవులకు చేసింది ఏమీ లేదని క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ అన్నారు. ఆదివారం మద్దిలపాలెంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలం చెల్లిన రాజకీయ నాయకుడు చంద్రబాబు నాయుడని అన్నారు. మతిభ్రమించి, సహనం కోల్పోయి ఆయన ఏవేవో మాటలు మాట్లాడుతున్నారన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో క్రైస్తవులకు చేసిన మేలును వివరించారు.

28న విశాఖకు ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్

సాగర తీర ఐటి కాన్సెప్ట్‌కు ఊతం
సంస్థ హెచ్‌ఆర్ విభాగ నిపుణుల వెల్లడి

ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో

ఐటి హబ్ విశాఖ.. అన్న భావన సార్థకం చేసేలాగ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఐటి సంస్థల ప్రవేశానికి మార్గం సుగమం అవుతోంది. విశాఖలోని రుషికొండ ఐటి హిల్స్‌లో పూర్తయిన ఇన్ఫోసిస్ డవలప్‌మెంట్ సెంటర్ (ఐడిసి)లో ఈ నెల 28న కార్యకలాపాలను ప్రారంభించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు తాజాగా ఇన్ఫోసిస్ హెచ్‌ఆర్ విభాగ నిపుణులు ఆదివారం తాజా విషయాలు వెల్లడించారు. ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన వేల సంఖ్యలో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లకు ఇదో ఉద్యోగ వరంగా ఉంటుందని తెలిపారు. విశాఖతోపాటు దేశంలోని కోయంబత్తూరు, నోయిడా, కోల్‌కతా, హుబ్లీ, ముంబయి నగరాల్లోనూ ఈ ఇన్ఫోసిస్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయని తెలుస్తోంది.

ఐటి హిల్స్‌పై 38 కంపెనీలు

విశాఖ రుషికొండ ఐటి హిల్స్‌పై 38 కంపెనీల వరకూ ఉన్నాయి. ఆక్యుపెన్సీ రేషియో పరిమితంగా ఉంది. మిలీనియం టవర్స్‌లోనే 14 ఫ్లోర్లకి కేవలం 4 ఫ్లోర్లలోనే ఐటి ఉద్యోగులున్నారు. విశాఖ మొత్తంగా 28 వేల మంది ఉద్యోగులు నేరుగా ఈ కంపెనీల్లో పనిచేస్తున్నారు. అవుట్ సోర్సింగ్ (వర్క్ ఫ్రం హోం) చూసుకుంటే విశాఖ నగరం మొత్తంగా మరో 50 వేల మంది పనిచేస్తున్నారు.

ఇన్ఫోసిస్ లాంటి దగ్గజ ఐటి సంస్థ విశాఖకు రావడంతో ఆక్యుపెన్సీ రేటు పెరిగే అవకాశాలు భారీగా ఉన్నాయి. జీతాల విషయానికొస్తే రూ.15 వేల నుంచి రూ.18 వేలే ప్రారంభంలో ఐటి కంపెనీల నుంచి ఉద్యోగులు పొందుతున్నారు. రూ.50 వేలు మార్క్ దాటాలంటే ఇన్ఫోసిస్ లాంటివి రావాల్సిందేనని ఐటి నిపుణులు, ఐటి ఉద్యోగాల కోసం ఎదురుచూసే వారంతా చెబుతున్నారు.

తొలి దఫా 650 మందితోనూ, తర్వాత 1000 మందితో ఇన్ఫోసిస్ ఆఫీసు నడపనుంది. సాఫ్ట్‌వేర్ డవలప్‌మెంట్, ఐటి ఎనేబుల్డ్ సర్వీసెస్ (ఐటిఇఎస్), ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్స్ విభాగాల్లో పనిచేస్తున్న వారికి ఈ సంస్థ ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ల నైపుణ్యాలను పరీక్షించి ఉద్యోగాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

క్యూ కడుతున్న కంపెనీలు

: రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి

ఇన్ఫోసిస్ సహా విప్రో, ఐబిఎం, టిసిఎస్ సంస్థలు కూడా విశాఖ కేంద్రంగా ఐటి కార్యకలాపాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేసుకుం టున్నాయని, ఉద్యోగాల కల్పనకు మ్యాప్ తయారు చేస్తున్నాయని రాజ్యసభ సభ్యులు, వైసిపి నాయకులు వి.విజయసాయిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్ఫోసిస్ రాకతో ఐటి రంగంలో ఉద్యోగాలకు ఉన్న లోటు భర్తీకానుందన్నారు.

లాభాల బాటలో ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు

మాట్లాడుతున్న రాఘవేంద్రరావు

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : ది విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంకు 108వ మహాజన సభ ఆదివారం మద్దిలపాలెం సమీపంలోని కాకతీయ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా బ్యాంకు అధ్యక్షులు చలసాని రాఘవేంద్రరావు హాజరై 2022–23 ఆర్థిక సంవత్సర వార్షిక నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గడిచిన ఆర్థిక సంవత్సరానికి రూ.7026 కోట్ల వ్యాపారం జరిగిందని, షేర్ ధనం రూ.305 కోట్లుగా నమోదైందని అన్నారు. గత ఆర్థిక సంవత్సరం 2022–23లో రూ.73.14 కోట్ల లాభాలు ఆర్జించినట్లు పేర్కొన్నారు. 2023–24 మార్చి 31 నాటికి రూ.7728.43 కోట్ల వ్యాపార లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్టు తెలిపారు. సభ్యుల సంఖ్య లక్షకు, షేర్ ధనం రూ.350 కోట్లకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సెక్యూరిటీలు, ఇతర బ్యాంకులలో పెట్టుబడులు రూ.1620 కోట్లుగా నమోదు అయ్యాయన్నారు. బ్యాంకు ఎమిరిటస్ చైర్మన్ మానం ఆంజనేయులు మాట్లాడుతూ సహకార బ్యాంకుల మీద రిజర్వు బ్యాంకు అనుసరిస్తున్న నిరంకుశమైన, అసంబద్ధమైన నిర్ణయాలను వ్యతిరేకిస్తూ న్యాయపోరాటం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. బ్యాంకు ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ పాలకవర్గం ఆలోచనలు చేయాలన్నారు. సమావేశంలో బ్యాంకు అభివృద్ధి లక్ష్యాలు, నూతన సభ్యులను చేర్పించడం, షేర్ ధనం, మెడిక్లెయిం, నిరర్థక ఆస్తుల వసూళు తదితర అంశాలపై తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించారు. సమావేశంలో సీనియర్ వైస్ చైర్మన్ బి.భాస్కరరావు, బ్యాంకు డైరెక్టర్లు ఎస్.నాగభూషణ చౌదరి, ఎజె.స్థాలిన్, ఎన్.కామరాజు, కె.భవాని, వి.చంద్రశేఖర్, జి.జనార్ధన రావు, సిహెచ్. ఆది నారాయణ శాస్త్రి, ఎస్.జానకి రామచంద్రరావు, కో–ఆప్టెడ్ డైరెక్టర్ డి.బాబూరావు, వైద్యనాథన్, బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి పివి.నరసింహమూర్తి, జనరల్ మేనేజర్ ఎవి.రామకృష్ణారావు పాల్గొన్నారు.

సూర్రెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి – కలెక్టరేట్ : జివిఎంసిలో కాంట్రాక్ట్ కార్మికుడుగా పనిచేసి మృతి చెందిన పిట్ల సూర్రెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని జివిఎంసి ప్రధాన కార్యాలయం వద్ద జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్యర్యంలో ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు, ఉపాధ్యక్షులు శీర రమణ మాట్లాడుతూ సూర్రెడ్డి స్ట్రీట్ లైటింగ్ కాంట్రాక్టర్ వద్ద బిర్లా జంక్షన్ బృందావనం పార్కు వద్ద స్ట్రీట్ లైటింగ్ పనిచేస్తుండగా కరెంట్ షాక్ కొట్టి అదే ప్రదేశంలో శనివారం సాయంత్రం మరణించారన్నారు. ఈ విషయమై కాంట్రాక్టర్‌గానీ, జివిఎంసి యాజమాన్యంగానీ స్పందించలేదన్నారు. చనిపోయిన కార్మికుని కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం, కార్మికుని తల్లికి లేదా అక్కకు ఉద్యోగం, ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు, కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి జె.నాయుడు, ఇ.ఆదినారాయణ, ఎస్.నాగేంద్ర పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఉధృత ఉద్యమం

ప్రజాశక్తి – కలెక్టరేట్ : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఉద్యమాన్ని రానున్న కాలంలో మరింత ఉధృతం చేయనున్నట్టు బిహెచ్‌ఇఎల్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) కార్యదర్శి ఎస్.అప్పారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు ఆదివారానికి 815వ రోజుకు చేరాయి. దీక్షల్లో బిహెచ్‌ఇఎల్, హెచ్‌పిసిఎల్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలు వస్తున్నందున కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి తగిన విధంగా బుద్ధి చెప్పడానికి ఇది మంచి సమయమన్నారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. దీక్షల్లో యూనియన్ కోశాధికారి కె.నారపరెడ్డి, హెచ్‌పిసిఎల్ యూనియన్ సహాయ కార్యదర్శి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గాజువాక జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P 61/2091 O.S 206/2018

Between
నంబారు అప్పారావు ...**డిక్రీ హోల్డర్**
And
సుధమల్ల పెంటయ్య
సుధమల్ల దుర్గ ...**జడ్జిమెంట్ డెటర్**

వేలం ప్రకటన

పై నంబరు అమలు పిటీషనులో డిక్రీ బాకీ రాబట్టు నిమిత్తం పైన 1వ జె.డి.ఆర్ గారి ఆస్థిపై పై కోర్టువారు **తేదీ.13-07-2023న ఉదయం గం.10:30 ని॥లకు** మహారాజశ్రీ గాజువాక జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో బహిరంగ వేలం వేయుదురు. కావున. ఆసక్తి గలవారు హాజరై వేలంలో పాల్గొనగలరు.

షెడ్యూలు ఆస్తి వివరం

విశాఖపట్నం జిల్లా పెదగంట్యాడ సబురి, పెదగంట్యాడ మండలం ఆర్.హెచ్.కోలని నెల్లి ముక్కు గ్రామం తాలుకా సర్వే నెం.80, ప్లాట్ నెం.491/P లో 53.5 చ.గజాల విస్తీర్ణం గల స్థలం అందలి డో.నెం21-43-15/1,అసెస్‌మెంట్ నెం.1086297393 గల గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి ఫ్లోర్ గల ఆర్.సి.సి బిల్డింగ్ ఇల్లు.

షెడ్యూలు గల యావత్తు స్థిరాస్తికి హద్దులు

తూర్పు: ఎస్.ముసలయ్య గారి ఆర్.సి.సి ఇల్లు. **దక్షిణం :** రోడ్డు, **పడమర :** ఎస్.అప్పారావు గారి ఇంటికి మరియు ఎస్. పెంటయ్య గారి, ఇంటి మధ్య మందడి గోడ. **ఉత్తరం :** ఎస్.నరసింగరావు గారి ఆర్.సి.సి ఇల్లు.

డిక్రీ హోల్డర్ విలువ : రూ.10,00,000,
అమీన విలువ : రూ.20,00,000,
మార్కెట్ విలువ : రూ.15,34,250

పై హద్దులు మధ్యస్థమైన ఆస్థి ఈ అమలు వేలం ఆస్థి అయి ఉన్నది.

By order of the Honourable Court.
N.SIVA PRASADA RAO
ADVOCATE & NOTARY
D No 17-52/1 Ramalayam Street
OLD GOPALAPATNAM, Vizag-027
Cell No. 8919006018

శంభువానిపాలేనికి ఆర్‌టిసి బస్సు

నెరవేరిన ఎన్నో ఏళ్ల కల - ఆనందంలో గిరిజనులు

ప్రజాశక్తి -పిఎం పాలెం : జివిఎంసి 6వ వార్డు పరిధి పిఎం.పాలెం సమీపంలోని మారుమూల గిరిజన ప్రాంతమైన శంభువానిపాలేనికి ఎన్నో ఏళ్ల తరువాత మొట్ట మొదటి సారిగా ఆర్‌టిసి బస్సును వేశారు. ఆదివారం ఉదయం శంభువానిపాలెంలో ఆర్‌టిసి బస్సుకు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పేద ప్రజలు సమస్యలు తెలుసుకోగలుగుతున్నామని, అందులో భాగంగానే శంభువానిపాలెం ప్రాంతంలోని గిరిజనులు రవాణా సౌకర్యం లేక పడుతున్న ఇబ్బందులు తమ దృష్టికి వచ్చాయని చెప్పారు. దీంతో ఈ ప్రాంతానికి బస్సు సౌకర్యం కల్పించామని తెలిపారు. ఎన్నో ఏళ్ల నుంచి కనీసం బస్సు సౌకర్యం లేని వీరికి ఈ సౌకర్యం కల్పించినందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. గిరిజనులమనే గుర్తింపు పత్రాలు లేవని, అత్యవసర వేళల్లో కనీసం అంబులెన్స్ సర్వీస్ కూడా లేని పరిస్థితులలో తాము నివసిస్తున్నామని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. నగరంలోనే ఉంటున్నా ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో ఉన్నతాధికారులతో మాట్లాడి శంభువానిపాలెం గిరిజన ప్రాంతానికి అంబులెన్స్ సర్వీస్, ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ గిరిజన ప్రాంతంలో నివాసముంటున్న వారిలో సగానికి పైగా ప్రజలకు గుర్తింపు పత్రాలను అందజేశామని, మిగతా వారికి కూడా త్వరలోనే అందిస్తామని చెప్పారు. జిల్లా కలెక్టర్‌తో, బిఎస్ఎన్ఎల్ సంస్థతో చర్చలు జరిపి కమ్యూనికేషన్ వ్యవస్థ ఏర్పాటుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ ఎ.అప్పలరాజు, మద్దిలపాలెం డిపో మేనేజర్ ఎన్.అరుణకుమారి, నగరాల కార్పొరేషన్ చైర్మన్ పిల్ల సుజాతసత్యనారాయణ, జోన్-2 కమిషనర్ కె.కనకమహాలక్ష్మి, 6వ వార్డు వైసిపి అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, స్థానిక వైసిపి నేతలు పోతిన ఎల్లాజీ, పోతిన ప్రసాద్, గాదె రోసిరెడ్డి, గుంటుబోయిన సంజీవ్ యాదవ్, సియ్యద్రి కనకరాజు, ముందుండి రాజేశ్వరి, మోజ్జాడ రమణమూర్తి, పోతిన సూరిబాబు, కురిటి వెంకట లోహిత్, తదితరులు పాల్గొన్నారు.

జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

నేరాలు ఘోరాలు

రైలు కిందపడి యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి -గోపాలపట్నం : రైలు కిందపడి యువకుడు దుర్మరణం చెందిన ఘటన ఎన్ఎడి కొత్త రోడ్డు రైల్వే బ్రిడ్జి కింద శనివారం రాత్రి చోటుచేసుకుంది. రైల్వే, ఎయిర్‌పోర్టు పోలీసుల కథనం ప్రకారం... మురళీనగర్ ప్రాంతానికి చెందిన ఆదినారాయణగా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న సురక్షపై నేడు సమీక్ష

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండల ఎంపిడిఒ కార్యాలయంలో 'జగనన్న సురక్షపై' సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు వైసిపి మండల అధ్యక్షులు బంక సత్యనారాయణ తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

అప్పన్నను దర్శించిన ఢిల్లీ హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను ఆదివారం ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ చంద్రదరి సింగ్ దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి భ్రమరాంబ, సూపరింటెండెంట్ పాలూరి నరసింహారావు స్వాగతం పలికారు. జడ్జి దంపతులు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

ఆనందపురం పిహెచ్‌సి వైద్యాధికారిగా గంగునాయుడు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా గంగునాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు విధులు నిర్వహించిన డాక్టర్ కోరాడ శైలజ బదిలీపై విజయనగరం వెళ్లారు. ఆమె స్థానంలో పశ్చిమగోదావరి జిల్లా, అల్లుమూరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసిన డాక్టర్ గంగునాయుడు వచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ గంగునాయుడు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చేపట్టిన కుటుంబ డాక్టర్ విధానాన్ని సక్రమంగా నిర్వహిస్తామన్నారు. మండల ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటానని, అందరికీ అందుబాటులో ఉంటానని చెప్పారు.

బుడగజంగాల కాలనీకి కుళాయిలు

ప్రజాశక్తి- ఆనందపురం: ఆనందపురం పంచాయతీ, బేడ బుడగ జంగాల కాలనీలో నీటి కుళాయిలను ఆదివారం సర్పంచ్ చందక లక్ష్మి ప్రారంభించారు. బుడగ జంగాల కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో సర్పంచ్ స్పందించి కుళాయిలు ఏర్పాటుచేశారు. దీంతో సర్పంచ్‌కు కాలనీ ప్రజలు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు షిణగం పెదరామారావు, షిణగం చినరామారావు, చందక శంకర్, మెడిశెట్టి రాంజీ, జెడ్‌పి స్కూల్ చైర్మన్ చందక అప్పలనాయుడు, సూర్యం, అరుణ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి కుళాయిలను ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మి

వీధి దీపాలు వెలగక చీకట్లోనే ఉన్న సంతోషిమాత గుడి వీధి

అంధకారంలో సంతోషిమాత గుడి వీధి

ప్రజాశక్తి-సింహాచలం: జివిఎంసి 98వ వార్డు పరిధిలోని సంతోషిమాత గుడి వీధిలో నాలుగు రోజులుగా వీధి దీపాలు వెలగక రాత్రి వేళ స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళ విష సర్పాలు రోడ్డుపైకి రావడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ దీపాలు వెలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

అంధుల పాఠశాలలో ప్రవేశాలు

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం న్యాయకళాశాల రోడ్డులో ఉన్న విశాఖ అంధుల పాఠశాలలో ఈ ఏడాది ప్రవేశాలకు అర్హులైన బాల బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కరెస్పాండెంట్ రత్నరాజు, ప్రధానోపాధ్యాయులు సుధారాణి తెలిపారు. ఒకటి నుంచి పదో తరగతి (స్టేట్ సిలబస్) వరకు విద్యాబోధన, బ్రెయిలీ లిపి, కంప్యూటర్ శిక్షణ, మోడల్ విద్య, ఇండోర్, అవుట్ డోర్ క్రీడలు, పాటలు, సంగీత శిక్షణ, గ్రంథాలయం, ప్రయోగశాల తదితర విద్యా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇక్కడ విద్యార్థులకు ఉచిత విద్య, వసతి లభిస్తుందని, అర్హులైన అంధ విద్యార్థులు పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 99895 62489, 92472 36898 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అనంతపద్మనాభ స్వామి సంక్షేమ సేవా సంఘం కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి -పద్మనాభం : మండల కేంద్రమైన పద్మనాభంలో అనంతపద్మనాభ స్వామి సంక్షేమ సేవా సంఘం కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అనంత పద్మనాభ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు దంతులూరి గోపాలకృష్ణమూర్తిరాజు మాట్లాడుతూ, సంస్థ ద్వారా సోమ, గురువారాల్లో సమస్యలపై ఫిర్యాదులను సేకరించి సమస్య స్థాయిని బట్టి అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి పరిష్కరిస్తామని చెప్పారు. ఇప్పటివరకు రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరాలతో పాటు అనంత పద్మనాభ స్వామి సేవా కార్యక్రమాల్లో కూడా పాల్గొని భక్తులకు సేవలందించామని తెలిపారు. రాబోయే రోజుల్లో అనంతపద్మనాభ స్వామి కొండ ఘాట్ రోడ్డు మార్గానికి. ముఖద్వారం నిర్మాణం, తెప్పోత్సవం నిర్వహించిన కోనేరు అభివీద్ధి వంటి కార్యక్రమాలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే మండలంలో చేపట్టిన భూసేకరణలో పలువురు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు రూపాకుల రవికుమార్, ఉప్పాడ అప్పారావు, రెడ్డిపల్లి శ్రీనివాసరావు, పాలూరి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం తాటితూరు గ్రామ సచివాలయం వద్ద ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. తాటితూరు హెల్పింగ్ హేండ్స్ వ్యవస్థాపకులు పల్లంటి శ్యామ్‌సుందర్, కనకల వెంకట అప్పారావు ఆర్థిక సాయంతో ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో సుమారు 200 మందిని పరీక్షించారు. 40 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు నిర్ధారించారు. త్వరలో వంద మందికి ఉచితంగా కళ్ళ జోళ్లు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

శిల్పారామంలో శాస్త్రీయ, జానపద నృత్యాలు

శాస్త్రీయ నృత్యం చేస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి -పిఎం.పాలెం : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మధురవాడ శిల్పారామంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన శ్రీ నటరాజ నాట్యమండలిచే శాస్త్రీయ, జానపద కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక కౌత్వం, ఘాటనృత్యం, రామ చక్కని సీత, శివాష్టకం, వేయి నామాల వాడు, ఓం గణపతి పతయే నమ్మ, ఒక పరి ఒక పరి, వదినకు ఒకసారి, రెలారే రెలరే తదితర అంశాలను ప్రదర్శించారు. జస్మితా, స్నేహ, సింధు, మహిశ్రీ, హాసిని, వర్షిత, జిస్మిత కళాకారులు నృత్యాలను ప్రదర్శించారని శిల్పారామం పరిపాలనాధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.

రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రం అందిస్తున్న శివశంకర్

పలుచోట్ల రక్తదాన శిబిరాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

మాధవధార : జనసేన డాక్టర్స్ సెల్ ఎపి చైర్మన్, సుర్లక్ష హాస్పిటల్ అధినేత డాక్టర్ బొడ్డేపల్లి రఘు ముందస్తు జన్మదిన వేడుకల్లో భాగంగా ఆదివారం మాధవధార కనకదుర్గ ఫంక్షన్ హాల్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్ నేతృత్వంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్ హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం శివశంకర్ మాట్లాడుతూ, సమాజ హితమే ధ్యేయంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమని కొనియాడారు. డాక్టర్ బొడ్డేపల్లి రఘు మాట్లాడుతూ, తన జన్మదిన వేడుకలను అభిమానులు, కార్యకర్తలు, మహిళలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. కార్యక్రమంలో సుమారు 200 మందికి పైగా స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. జనసేన నాయకులు సంకు వెంకటేశ్వరరావు, కందుల నాగరాజు, బీశెట్టి గోపీకృష్ణ, పెతకంశెట్టి శ్యామ్‌సుందర్, గవర సోమశేఖర్, ప్రభ క్రికెట్ అకాడమీ చైర్మన్ ప్రభాకర్, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఏపీ స్టేట్ ప్రెసిడెంట్ పప్పల రామ్మోహనరావు, పిన్నింటి పార్వతి, ఎడ్లపల్లి కళయజ్ఞశ్రీ, నందిత, శాలిని పాల్గొన్నారు.

గాజువాక : జివిఎంసి 74వ వార్డు పరిధి దయాల్‌నగర్ చైతన్య స్కూల్ వద్ద కీర్తిశేషులు రామకృష్ణ జ్ఞాపకార్థం అమ్మ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వంశీరెడ్డి మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చన్నారు. అన్ని దానాల కన్నా రక్తదానం ఎంతో గొప్పదన్నారు. రక్తదానం వల్ల వేరొక ప్రాణాన్ని కాపాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమములో అమ్మబ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు వినోద్‌బాబు, వివిఎస్.సూరిబాబు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

భవిష్యత్తు గ్యారంటీ బస్సు యాత్రను
విజయవంతం చేయాలి : పల్లా

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజవర్గంలో ఈ నెల 27వ తేదీన నిర్వహించే భవిష్యత్తు గ్యారెంటీ బస్సు యాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నాలుగేళ్ల జగన్మోహన్‌రెడ్డి పాలనలో దగా పడిన ఆంధ్రప్రదేశ్‌కు పూర్వ వైభవం రావాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. మహానాడులో చంద్రబాబు ప్రకటించిన భవిష్యత్తు గ్యారంటీ సంక్షేమ పథకాలు చూసి వైసిపి నాయకులు గుండెల్లో ప్రకంపనలు మొదలయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, టిడిపి నాయకులు పులి వెంకటరమణారెడ్డి, ఎస్.అనంతలక్ష్మి, మొల్లి పెంటిరాజు, పెద్దాడ సోమనాయుడు, గంతకూరు అప్పారావు, డి.వి.జగదీష్, సింగూర్ అనంతు, గోమాడు వాసు పాల్గొన్నారు.

సంప్రదాయ కళలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : సంప్రదాయ కళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవి.రాజశేఖర్ అన్నారు. ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో మిరాకిల్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకులు మహమ్మద్ షకీల్ సారధ్యంలో 'సకల కళావైభవం' పేరిట సంగీతం, నృత్యం, చిత్రలేఖనం తదితర విభిన్న అంశాలపై సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. వివిధ రంగాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను అందజేశారు. అనంతరం ఎంవి.రాజశేఖర్ మాట్లాడుతూ, కళాకారులలో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు దోహదపడతాయన్నారు. చక్కని కార్యక్రమాన్ని నిర్వహించిన మహమ్మద్ షకీల్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో రవితేజ, కోరుకొండ రంగారావు, మహమ్మద్ షకీల్ తదితరులు పాల్గొన్నారు.

శాకాహార సద్భావన ర్యాలీ

ప్రజాశక్తి -గాజువాక : శ్రీ వినాయక పిరమిడ్ జ్ఞాన కేంద్రం నిర్వాహకులు జయలక్ష్మి ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో ఆదివారం శాకాహార సద్భావన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శాకాహారం వల్ల మనిషి శరీరం, మనసు, బుద్ధి పవిత్రంగా ఉంటాయని, ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంచుతూ, నినాదాలు చేశారు. శాకాహార ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ మాస్టర్స్, శ్రీ వినాయక పిరమిడ్ ధ్యాన కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

కఠోర శ్రమ ద్వారానే ఉన్నత శిఖరాలకు...

కెజిహెచ్ సూపరింటెండెంట్ శివానంద సన్మాన సభలో వక్తలు

కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద దంపతులను సన్మానిస్తున్న అతిథులు

ప్రజాశక్తి -తగరపువలస : కఠోర శ్రమ ద్వారానే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నది కెజిహెచ్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన స్థానిక కొండపేటకు చెందిన ప్రముఖ వైద్యులు పత్రి శివానంద ప్రత్యక్ష ఉదాహరణ అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యాన ఆదివారం డాక్టర్ శివానందను ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన సభకు ముఖ్య అతిథిగా హాజరైన విశాఖ నేర విభాగం అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డి.గంగాధర్ మాట్లాడుతూ, ఎన్నో కష్టాలను ఎదుర్కొని చదువుకోవడం ద్వారానే ఉన్నతో ద్యోగాలు వచ్చాయని స్పష్టం చేశారు. ఉన్నతోద్యోగం ద్వారా సాధ్యమైనంత వరకు పేదలకు సాయం చేయాలన్నదే తమ ఉద్దేశమన్నారు. మల్కాపురం సిఐ బి.లూథర్‌బాబు మాట్లాడుతూ, ఎంచుకున్న రంగంలో నిరంతర సాధన ద్వారానే ఫలితాలు సాధించవచ్చని, ఆ దిశగా యువత దృష్టి సారించాలని కోరారు. ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు గంటన మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జివిఎంసి 55వ వార్డు కార్పొరేటర్ పట్టా శశికళ, యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల సూపరింటెండెంట్ జి.వి.అప్పారావు, స్థానికులు కాళ్ల శ్రీనివాసరావు, ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దత్తి ఈశ్వరరావు, రేఖ అప్పారావు, సభ్యులు పి.నాగేశ్వరరావు, యు.రాము, రవిశంకర్, వైవి.రమణ తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు పాఠశాల ఆవరణలో ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జ్ఞాపకశక్తి, ఏకాగ్రతపై అవగాహన

ప్రజాశక్తి-సీతమ్మధార : రంగసాయి నాటక గ్రంథాలయం ఆధ్వర్యాన పౌర గ్రంథాలయంలో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, ఇంగ్లీషు మాట్లాడడంపై ఆదివారం ఒక రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్స్ మొ బ్రిడ్జ్ వ్యవస్థాపకులు రేవళ్ల మోహన్ మాట్లాడుతూ, సాధనతో జ్ఞాపకశక్తి అలవరచుకోవచ్చు అన్నారు. చిన్నపాటి మెళకువలతో ఏకాగ్రత సాధ్యం అవుతుందని చెప్పారు. పిల్లలు, పెద్దలు ఎవరైనా సాధనతో సాధించ వచ్చన్నారు. విద్యార్థులతో పాటు పెద్దలు జ్ఞాపకశక్తి, ఏకాగ్రతను పెంచుకోవడంలో అనుసరించాల్సిన అంశాల ప్రాధాన్యతను వివరించారు. నోన్ టు అన్‌నోన్ పదాలతో జ్ఞాపకం ఉంచుకోవాల్సిన విధానాలు వివరించారు. సోషల్ వర్కర్ అబ్దుల్ కరీం మాట్లాడుతూ, యాంత్రిక సమాజంలో జ్ఞాపకశక్తి ఆవశ్యకత గురించి వివరించారు. లెక్సికోగ్రాఫర్, వివిఎస్‌డి ఆంగ్ల ఆంధ్ర నిఘంటువు కర్త సనపల జీవన్‌కుమార్ మాట్లాడుతూ, భాషలో పట్టు, వినియోగంలో అనుసరించాల్సిన విషయాలనూ వివరించారు. ఇంగ్లీషు లాంగ్వేజ్ కోర్స్ నిర్వాహకులు మాచెర్ల ఆనంద్‌శర్మ మాట్లాడుతూ, భాషకు ఉన్న ప్రాముఖ్యత, జ్ఞాపకశక్తి అవసరాలను వివరించారు. తన్మయి క్రియేటివ్స్ అధ్యక్షులు బివిఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికీ ఏకాగ్రత, జ్ఞాపకశక్తి అవసరమన్నారు. వర్క్‌షాప్ ప్రధాన నిర్వాహకులు బాదంగీర్ సాయి మాట్లాడుతూ, నాటకం, సినిమాలతో పాటు విద్యార్థులకు అవసరమైన పలు కార్యక్రమాలను ఇక నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.హేమ, వియ్యపు రామకృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న వార్వా, నివాస్ నాయకులు

చెత్త సేకరణ ఛార్జీలు నిలుపుచేయాలని ధర్నా

ప్రజాశక్తి -గాజువాక : చెత్త సేకరణ ఛార్జీల వసూలును తక్షణమే నిలుపుదల చేయాలని కోరుతూ జివిఎంసి 67వ వార్డు పరిధి అశోక్ నగర్ సచివాలయం వద్ద వార్వా, నివాస్ ఆధ్వర్యాన ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, విలువ ఆధారిత ఆస్తి పన్ను, చెత్త సేకరణ ఛార్జీల పన్నులపై హైకోర్టులో కేసు ఉందని, తీర్పు వచ్చేవరకు వసూలు చేయకూడదని కోరారు. పన్ను చెల్లించాలని ప్రజలపై ఒత్తిడి చేయడం తగదన్నారు. ఈ ధర్నాలో వార్వా, నివాస్ నాయకులు కె.కిరీటం, కె.సంతోషం, కెపి.కుమార్, సుబేకర్, సభ్యులు పాల్గొన్నారు.

సురేష్‌కు వైసిపి ట్రేడ్ యూనియన్ బాధ్యతలు

సురేషియాదవ్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఆనంద్ కుమార్

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి 59వ వార్డు వైసిపి అధ్యక్షులు పుర్రె సురేష్‌కు పశ్చిమ నియోజకవర్గ వైసిపి ట్రేడ్ యూనియన్ నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తూ పార్టీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆదివారం నియామక ఉత్తర్వులు అందించారు. అనంతరం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ, అర్హులైన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దొరికేలా చూడాలని సూచించారు. సురేష్ మాట్లాడుతూ, ఆనంద్‌కుమార్ తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా పనిచేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా పుర్రె సురేష్‌కు వైసిపి కార్పొరేటర్లు, అధ్యక్షులు, ఇన్‌ఛార్జిలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంత కార్పొరేటర్లు గులిగిందల లావణ్య, కొణతాల సుధ, బల్ల లక్ష్మణరావు, ఉత్తరాంధ్ర ట్రేడ్ యూనియన్ నాయకులు కలిదిండి బద్రీనాథ్, అన్ని వార్డుల అధ్యక్షులు, 59వ వార్డు నాయకులు, యువత పాల్గొన్నారు.

బాక్సింగ్ ట్రోఫీ ఆవిష్కరణ

ప్రజాశక్తి -మధురవాడ : వైఎస్‌ఆర్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ ట్రోఫీని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదివారం ఆయన నివాసం వద్ద ఆవిష్కరించారు. ఈ బాక్సింగ్ పోటీలను మారుతి బాక్సింగ్ క్లబ్ వ్యవస్థాపకులు వంకాయల మారుతి ప్రసాద్ ఆధ్వర్యాన చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జులై 7, 8, 9 తేదీలలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, మారుతీప్రసాద్ ఇంతకుముందు కూడా అనేకసార్లు ఈ పోటీలు నిర్వహించారని తెలిపారు. ఈ పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ వెంకటేశ్వరరావు, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి అప్పలరెడ్డి, దల్లి రామకృష్ణారెడ్డి, పిల్లా సత్యనారాయణ, బంగారు ప్రకాష్, పసుపులేటి గోపీనాథ్, జగ్గుపిల్ల నరేష్, బైపిల్ల ప్రసాదు, తైక్వాండో కోచ్ ఆనంద్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గం పరిధిలో గిరి ప్రదక్షిణ జరిగే రోడ్డు నిర్మాణ పనులను ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ఆదివారం పరిశీలించారు. రూ.4 కోట్లు, 48 లక్షల 46వేల వ్యయంతో చేపట్టిన గిరిప్రదక్షిణ మెయిన్ రోడ్డు పునర్నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని డిఇ భరణి, కాంట్రాక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, కిరణ్‌రాజు, గురువాజీ, నరేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

46వ వార్డులో
గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 46వ వార్డు పరిధి లక్ష్మీనారాయణపురం, కస్తూరినగర్, శాంతినగర్‌లో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఇప్పటివరకు చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలను నిష్పక్షపాతంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, బల్లిరెడ్డి గోవింద్, జివిఎంసి అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకానికి మోక్షమెప్పుడో..!

బంగారుమెట్ట ఎత్తిపోతల పథకం వాటర్ ట్యాంక్

- అరకొరగా ఆగిన నిర్మాణంతో నిరుపయోగం
- ఐదేళ్లుగా ఆశగా ఎదురుచూస్తున్న ఆయకట్టు రైతులు

ప్రజాశక్తి -వడ్డాది : అర్ధాంతరంగా ఆగిపోయిన ఎత్తిపోతల పథకంలో తమ పంటపొలాలకు సాగునీరు అందని పరిస్థితి ఉందని మండలంలోని లోపూడి, ఎల్‌బిపి అగ్రహారం రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులన్నీ దాదాపు పూర్తయినా, చివరిదశలో అరకిలోమీటరు పైపులైన్ ఏర్పాటుకు కొందరు రైతుల నుంచి అభ్యంతరం వ్యక్తం కావడంతో ఏకంగా పథకమే వినియోగంలోకి రాని దుస్థితి ఏర్పడింది. సంబంధిత ఎంఎస్ఐడిసి ఇంజినీరింగ్ అధికారులు చొరవచూపి, పథకం పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు ఐదేళ్లుగా అభ్యర్థిస్తూ ఆశగా ఎదురుచూస్తున్నారు. వివరాలివి.

మండలంలోని లులూరు రెవెన్యూ పరిధిలో ఎనిమిదేళ్ల క్రితం డిఆర్‌డిఒ సైనిక శిక్షణ కేంద్రం కోసం లోపూడి, ఎల్‌బిపి అగ్రహారం గ్రామాలకు చెందిన 220మంది రైతుల నుంచి 120 ఎకరాల పల్లపు భూములను అధికారులు సేకరించారు. వరి పండే భూములన్నీ సైనిక శిక్షణ కేంద్రానికి తీసుకోవడంతో, మిగిలిన మెట్టు పొలాలకు సాగునీటి సౌకర్యం కల్పించాలని అప్పటి చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజుకు మొరపెట్టుకున్నారు.

దీనిపై నాటి ఎమ్మెల్యే రాజు స్పందించి, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడం, మెట్టు భూములకు సాగునీటి కోసం పెద్దేరు నదిపై ఎత్తిపోతల పథకం నిర్మాణానికి రూ.4.50కోట్లు మంజూరు చకాచకా జరిగాయి. 2016-17లో టెండర్లు ఆధారంగా అప్పగించిన కాంట్రాక్టర్ పనులు మొదలెట్టి, బ్యాంక్ జాక్వెల్, పంపు హౌస్, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు మూడున్నర కిలోమీటర్లకుగాను మూడు కిలోమీటర్ల పైప్‌లైను నిర్మాణం శరవేగంగా సాగి, ఏడాదిన్నర కాలంలో పూర్తి చేశారు ఈ మేరకు సంబంధిత కాంట్రాక్టర్‌కు రూ.3.50కోట్ల బిల్లులు కూడా చెల్లించారు.

ఆరుగురు రైతుల అభ్యంతరంతో ఆగిన నిర్మాణపనులు

మరో 500 మీటర్ల మేర పైప్‌లైన్ నిర్మాణం పూర్తయితే, ఎత్తిపోతల పథకం ద్వారా మెట్టుపొలాలకు సాగునీరు అంది సస్యశ్యామలమౌతాయని, తమ సమస్యలు తీరిపోతాయని ఆశగా ఎదురుచూస్తున్న ఆయకట్టుదారులకు, ఆరుగురు రైతులు అభ్యంతరం ఆశనిపాతంగా మారింది. తమ భూముల్లో పైపులైన్లు ఏర్పాటు వద్దంటూ వారు హైకోర్టును ఆశ్రయించి, స్టే తెచ్చుకోవడంతో ఏకంగా పనులే నిలిచిపోయాయి.

అధికారుల నిర్లక్ష్యంతో ముందుకు కదలని పనులు

కోర్టుస్టేతో ఆగిపోయిన పనులు కొనసాగింపునకు అవసరమైన చర్యలు చేపట్టడంతో అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ ఎత్తిపోతల పథకం అలంకారప్రాయమైపోయింది. తర్వాత కొద్ది నెలలకే ఎన్నికలు జరిగి, ప్రభుత్వాలు మారి వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాన్ని పట్టించుకోవడం పూర్తిగా మానేశారు. కోర్టు స్టేపై కౌంటర్ దాఖలు చేయాలన్న అన్నదాతల అభ్యర్థన అరణ్యరోదనగానే మిగిలిపోయింది. పోనీ అభ్యంతరం వ్యక్తం చేసిన రైతులు పొలాల్లో కాకుండా వేరే మార్గంలో పైపులైన్ వేసి పనులు పూర్తి చేసి ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తేవాలన్న రైతుల అభ్యర్థనకు అధికారుల నుంచి స్పందన కరువైంది. దీంతో కేవలం కొద్దిపాటి పనులు పూర్తిచేస్తే, వందలాది ఎకరాలకు సాగునీరు అందే పథకం అర్ధాంతరంగా ఆగిపోయినా ప్రభుత్వం, అధికారుల నుంచి స్పందన లేకపోవడంపై అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఈ పథకానికి ఎప్పటికి మోక్షం వస్తుందోనని ఆశగా ఎదురుచూస్తున్నారు.

ధర్మశ్రీ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

వైసిపి మద్దతుదారులను సర్పంచ్‌లుగా గెలిపిస్తే ఎత్తిపోతల పథకాన్ని పున: ప్రారంభించి, పూర్తి చేస్తామని స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన మాటను ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ నిలబెట్టుకోవాలి. ఎమ్మెల్యే మాటను నమ్మి రెండు పంచాయతీల్లోనూ వైసిపి అభ్యర్థులే గెలిచి, రెండేళ్లవుతున్నా ఎటువంటి ప్రయత్నం చేయకపోవడం బాధాకరం.

తమరాన దాసు,
మాజీ సర్పంచ్, ఎల్‌బిపి.అగ్రహారం

చెరుకు బకాయి చెల్లించండి

ప్రజాశక్తి- కె.కోటపాడు : గడచిన సీజన్‌లో చోడవరం చక్కెర కర్మాగారానికి చెరకు సరఫరా చేసిన రైతులకు బకాయిలు వెంటనే చెల్లించాలని ఎపి రైతు సంఘం మండల నాయకులు రొంగలి ముత్యాల నాయుడు, వనము సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ, సుగర్ ఫ్యాక్టరీ సీజన్ ముగిసి మూడు నెలలు గడిచినా, చెరుకు పేమెంట్లు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. జనవరి నెల వరకే చెరుకు డబ్బులు చెల్లించిన అధికారులు, తర్వాత సరఫరా చేసిన చెరుకు పేమెంట్లు ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురౌతున్నారని, ముఖ్యంగా అప్పులు చెల్లించాలన్న ఒత్తిళ్లతో సతమతమౌతున్నారన్నారు. కొత్తసీజన్ ప్రారంభమై, పెట్టుబడులు లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు తక్షణమే చెరకు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. చెరకు రైతుల పట్ల ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యం, వ్యవహరిస్తున్న వైఖరి వల్ల అనేకమంది రైతులు చెరుకు వేసేందుకు ముఖం చాటేసే పరిస్థితి కనిపిస్తోందన్నారు.రైతులకు వడ్డీలు లేకుండా ఎరువులు సరఫరా చేసే విధానానికి యాజమాన్యం స్వస్తి చెప్పేసిందన్నారు. అలాగే గతేడాది రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేసిన వరివిత్తనాలు సరిగా మొలకెత్తని పరిస్థితుల్లో ఈ ఏడాది నాణ్యమైన విత్తనాలను సకాలంలో సరఫరాకు చర్యలు చేపట్టాలని కోరారు.

పార్టీ వ్యతిరేక శక్తులకు గుణపాఠం తప్పదు

అభినందన సభలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి- మునగపాక రూరల్: పార్టీ వ్యతిరేక శక్తులకు గుణపాఠం తప్పదని టిడిపి నేతలు దాడి ముసిలినాయుడు, పెంటకోట విజయ్ హెచ్చరించారు. ఆదివారం తెలుగుదేశం క్యాంపు కార్యాలయంలో మండలంలో భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్యయాత్ర విజయవంతమైన సందర్భంగా అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో పార్టీ బలపడుతున్న తరుణంలో కొందరు పార్టీ వ్యతిరేకశక్తులు మద్యం తాగొచ్చి, కార్యక్రమాన్ని విచ్ఛిన్నం చేసేందుకు విఫలయత్నం చేశారని, దీనికి సంబంధించిన వీడియోలు సేకరించామన్నారు. పార్టీ అధిష్టానానికి నివేదించి, వారిపై తగు చర్యలకు డిమాండ్ చేస్తామన్నారు. టిడిపిగ్రామ శాఖ అధ్యక్షులు దాడి శివ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డొక్కా నాగభూషణం, వెలగా మురళి, ఆడారి లక్ష్మణరావు, పెంటకోట శ్రీరామమూర్తి, విల్లూరి నరసింహ రవు, కోరుకొండ ప్రసాద్, కాండ్రేగుల పరదేశిరావు, భీశెట్టి గోవింద, ఆడారి తాతనాయుడు, దాడి భీమునాయుడు, సూరిశెట్టి దుర్గనాయుడు పాల్గొన్నారు.

పశువుల పాకలకు నిప్పంటించిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలి

సంఘటనాస్థలిలో ఆందోళన చేస్తున్న ఉపసర్పంచ్, బాధితులు

ప్రజాశక్తి- కశింకోట : మద్యం మత్తులో జమౌదులపాలెం గ్రామంలో పశువుల పాకలకు నిప్పంటించిన సర్పంచ్ ప్రతినిధి కరక శేషు, అతని సోదరుడు కరక రాజుపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం మాజీ ఉప సర్పంచ్ ఒమ్మి గంగునాయుడు ఆధ్వర్యంలో సంఘటనస్థలిలో ధర్నా చేశారు.ఈ సందర్భంగా ఉపసర్పంచ్ గంగునాయడుతోపాటు బాధితులు మాట్లాడుతూ బయ్యవరం గ్రామ సర్వే నంబర్ 195/1లో 50 సెంట్లు ఒకే కుటుంబానికి చెందిన 36 మంది స్వాధీనంలో ఉందన్నారు. పలుమార్లు ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించగా, అధికారులకు పూర్తి ఆధారాలు సమర్పించాక అటువైపు రాలేదన్నారు. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి శేషు సోదరుడు రాజు పాకలను తగలబెట్టారని ఆరోపించారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

అధికారులు స్పందించి, బాధితులకు న్యాయం చేయకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఒమ్మి శ్రీరామమూర్తి, పల్లా అప్పలనాయుడు, ఒమ్మి వెంకటరమణ, పల్లా అప్పారావు, పల్లా పార్వతి, ఒమ్మి కుమారి, పల్లా తలుపులమ్మ, దేముడమ్మ, అప్పయ్యమ్మ, లోవతల్లి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయండి : యుటిఎఫ్

సమావేశంలో పాల్గొన్న యుటిఎఫ్ ప్రతినిధులు

ప్రజాశక్తి -అనకాపల్లి : పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో అనకాపల్లి జిల్లా యుటిఎఫ్ ఆఫీసు బేరర్ల సమావేశంలో మాట్లాడుతూ యుటిఎఫ్ రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను జాయిన్ చేసుకోనే దిశగా విద్యార్థుల ఇంటికి వెళ్లి వారిని ప్రభుత్వ బడికి ప్రత్యేకంగా ఆహ్వానించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు బాగుంటేనే, బడుగు బలహీన వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, దానికోసం వెంటనే డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో పాఠశాలలకు పక్కా భవనాలు, నాడునేడు నిధులతో మౌలిక వసతులు కల్పించాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, గౌరవాధ్యక్షులు నెల్లి సుబ్బారావు, సహాధ్యక్షులు కట్టా శ్రీనివాసరావు, గాయత్రి, కోశాధికారి జోగా రాజేష్, కార్యదర్శులు పొలిమేర చంద్రరావు, జి.ఎస్. ప్రకాష్, కళింగ సతీష్, రమేష్‌రావు, చైతన్యషీల, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎల్లయ్యబాబు గంజి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బ్రాండిక్స్ ఆధ్వర్యాన 395 మందికి కంటి పరీక్షలు

రోగులకు కంటి అద్దాలు ఇస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి -అచ్యుతాపురం : బ్రాండిక్స్ సామాజిక ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఆపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన 109వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 395 మందికి కంటి పరీక్షలు చేశారు. విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటిఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో 33 మందికి ఉచితంగా కంటి అద్దాలను అందించారు. 79 మంది కంటి రోగులకు మందులు పంపిణీ చేశారు. 29 మంది కాటరాక్ట్ సర్జరీ చేయించుకోవడానికి వైద్యులు సూచించారు.శిబిరానికి వచ్చిన వారికి మజ్జిగ, ఫలహారాలు, భోజనం సదుపాయం కల్పించారు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు అండగా నిలవాలన్నదే ఈ కార్యక్రమం లక్ష్యమని బ్రాండిక్స్ ఇండియా పార్టనర్ దొరైస్వామి అన్నారు.

పాల సొసైటీ అధ్యక్షునిగా సోమేశ్వరరావు

సోమేశ్వరరావును అభినందిస్తున్న సర్పంచ్, ఎంపిటిసి

ప్రజాశక్తి - సబ్బవరం : మండలంలోని బంగారమ్మపాలెం విశాఖ డెయిరీ పాల సొసైటీ అధ్యక్షునిగా దొడ్డి సోమేశ్వరరావు ఎన్నికయ్యారు. సర్పంచ్ దాడి లావణ్య కన్నంనాయుడు, మాజీ ఎంపిటిసి దొడ్డి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలో సోమేశ్వరరావును ఎన్నుకున్నారు. అలాగే పాల సొసైటీ డైరెక్టర్‌గా దాడి కోటి రమణను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సోమేశ్వరరావు, కోటి రమణలను సర్పంచ్, ఎంపిటిసి అభినందించారు. కార్యక్రమంలో దొడ్డి వెంకటరావు, దొడ్డి రాజకోటి, దొడ్డి సూరిబాబు, దొడ్డి ముత్యాల నాయుడు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'లోనూ అర్హులకు సంక్షేమం

గడపగడపలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి- అనకాపల్లి : అడగకుండానే పేదలకు సంక్షేమ పథకాలను అందించిన సిఎం జగన్మోహన్‌రెడ్డి వెంటే జనమంతా ఉన్నారని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. అర్హులై ఉండి, సంక్షేమ పథకాలు అందని వారందరికీ వచ్చేనెలలో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమంలో అందజేస్తామని భరోసానిచ్చారు. ఆదివారం మండలంలోని రేబాకలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని, లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను అందజేసి, వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నాయకులు మంత్రిని కలిసి తమ సమస్యలు విన్నవించారు. నియోజకవర్గంలో అగ్రిగోల్డ్ బాధితులకు రూ. 60 కోట్ల చెల్లింపులు రావాల్సి ఉందని వివరించగా, ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని మంత్రి హామీ ఇచ్చారు. ఎస్‌సి కాలనీలో దోభీఖానా

డ్రైనేజీని ప్రారంభిస్తున్న మంత్రి అమర్

నిర్మించాలని కోరగా, అవసరమైన స్థలపరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి శ్రీనివాసరావు అనే వికలాంగుడికి బ్యాటరీ వాహనం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల పాకలను తొలగించిన స్థానే స్థలాలు ఇప్పించాలని స్థానికులు మంత్రి అమర్‌ను కోరగా, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రూ.15 లక్షలతో నిర్మించిన మురుగుకాలువలను మంత్రి ప్రారంభించారు. కాగా ఆదివారం గడపగడపకు 1, 14 క్లస్టర్ల వాలంటీర్లు గైర్హాజరుపై మంత్రి మండిపడ్డారు.

ఈ సందర్భంగా మంత్రి అమర్ మాట్లాడుతూ, చేసిన అభివృద్ధిని చూసి జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. తెలుగుదేశం నాయకులు బస్సు యాత్రల పేరుతో ప్రజలను తప్పుతోవ పట్టిస్తున్నారని, జనం మేల్కోకపోతే భారీ నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందన్నారు. అభివృద్ధిని బేరీజు వేసుకుని వచ్చే ఎన్నికల్లో విజ్ఞతతో ఓటేయాలని కోరారు కార్యక్రమంలో ఎంపీ భీశెట్టి సత్యవతి, ఎంపిపి గొర్లి సూరిబాబు, రేబాక సర్పంచ్ మార్టూరు సన్యాసమ్మ, ఎంపిటిసి మంత్రి సత్యనారాయణ పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం

రోగులను పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి -అచ్యుతాపురం :మండలంలోని రామన్నపాలెం గ్రామంలో ఆదివారం శ్రీ విష్ణు హాస్పిటల్ , ఇషాన్ హాస్పిటల్, సన్‌రైజ్ డయాగ్నొస్టిక్, సురక్ష హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. హెచ్‌సిజి కేన్సర్ హాస్పిటల్, కిమ్స్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన శిబిరంలో 150 మందికి బిపి, సుగర్, ఇతర పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సుధీర్ మాట్లాడుతూ సురక్ష హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ విష్ణు హాస్పిటల్‌లో ప్రతి శుక్రవారం ఉదయం 7 గంటల నుండి 10 గంటల వరకు ఉచితంగా సుగర్, బిపి పరీక్షలు చేస్తామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి కన్వీనర్ ధర్మిరెడ్డి నాయుడు బాబు, డి.ప్రదీప్ సోమశేఖర్ రెడ్డి. జానరెడ్డి పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను జయప్రదం చేయండి

వాలంటీర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ రవిసుభాష్

ప్రజాశక్తి- సబ్బవరం : జగనన్న సురక్షను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రవిసుభాష్ పట్టన్‌శెట్టి ఆదేశించారు. మండలంలోని తవ్వవానిపాలెంలో వాలంటీర్లతో ముఖాముఖి నిర్వహించి సూచనలు చేశారు. జులై ఒకటో తేదీ నుంచి వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు గుర్తించాలని, ఎవరెవరికి, ఏయే ధ్రువపత్రాలు అవసరమో సర్వే చేసి జాబితా సిద్ధం చేసి, తర్వాత సచివాలయంలో మంజూరు చేసి లబ్దిదారునికి ఇస్తామన్నారు. ఆధార్, రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డుల్లో తప్పులు సరిచేయడం, భూములు రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, పెళ్లి ధ్రువపత్రాలు, జనన మరణ, కుల, ఆదాయ వంటి సర్టిఫికెట్లు సచివాలయంలోనే ఇస్తామన్నారు. వాలంటీర్లు నిబద్ధతతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్ నాయుడు, తహశీల్దార్ బి. సత్యనారాయణ, ఎంపిటిసి బోకం బాలకృష్ణ పాల్గొన్నారు

వికలాంగ బాలలకు పుస్తకాలు, నిత్యావసరాలు

ఆశ్రమ బాలలకు సామగ్రి అందిస్తున్న సఖిసంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : విశాఖ మురళీనగర్ శ్రీ సఖి సేవా సమితి ఆధ్వర్యంలో అచ్యుతాపురం ఇంటిగ్రేటెడ్ వికలాంగుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఆదివారం రూ.1.50లక్షలు విలువచేసే నోటు పుస్తకాలు, రైన్ బాగ్స్, స్టేషనరీ, కూరగాయలు, చిన్నారులకు స్నాక్స్ అందజేశారు. ఆశ్రమ పాఠశాల వ్యవస్థాపకులు పిఎస్‌టి పట్నాయక్‌కు సఖి సేవా సంస్థ వ్యవస్థాపకులు బిందురాణి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ, వికలాంగ బాలలకు సాయం చేయడం ఎంతో తృప్తినిచ్చిందన్నారు. అనంతరం గతేడాది టెన్త్ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

రైతు సంక్షేమానికి వివి.రమణ విశేష కృషి

నివాళులు అర్పిస్తున్న లీడర్ రమణమూర్తి, తదితరులు

ప్రజాశక్తి -అనకాపల్లి : రాజ్యసభ సభ్యులుగా వి.వి రమణ రైతు సంక్షేమానికి విశేష కృషి జరిపారని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు, లీడర్ పత్రిక సంపాదకుడు వివి రమణమూర్తి అన్నారు. ఆదివారం వివి రమణ శతజయంతి సందర్భంగా తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో వివి రమణ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ విల్లూరి వెంకటరమణ బిసిల ప్రయోజనాల కోసం ఎంతో కష్టపడ్డారని, గవర సామాజిక వర్గానికి, రిజర్వేషన్ కల్పించారని గుర్తు చేశారు. తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని రైతులు పెట్టుబడితో స్థాపించారని, రైతులకు వ్యవసాయ పెట్టుబడి సాయం కోసం సహకార రంగంలో గౌరీ పిఎసిఎస్ బ్యాంకును నెలకొల్పారన్నారు. ఆయన కృషికి గుర్తుగా తుమ్మపాల సుగర్స్‌కు వివి.రమణ నామకరణం చేశారన్నారు. వివి.రమణ శత జయంతి ఉత్సవాల వేళ, ఆయన ఆశయసాధన కోసం, రైతాంగ సమస్యల పరిష్కారానికి టిడిపి పోరాటం చేస్తుందని నాగ జగదీశ్వర రావు అన్నారు. కార్యక్రమంలో తుమ్మపాల మాజీ సర్పంచ్, అన్నపూర్ణ పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కర్రి వెంకట సన్యాసినాయుడు(బాబి), టిడిపి నాయకులు కొణతాల శ్రీనివాసరావు, నడిపల్లి గణేశ్వరరావు, నడిపల్లి బోసు బాబు, సుగర్ ఫ్యాక్టరీ షేర్ హోల్డర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ గొర్లి మోది నాయుడు, కర్రి రమేష్, గొంతిన శ్రీనివాసరావు, ఫ్యాక్టరీ కార్మికులు నూకేశ్వరరావు, కింతాడ ఈశ్వరరావు, రవ్వ ఈశ్వరరావు పాల్గొన్నారు.

వైసిపి నేత 'చొక్కాకుల' దాతృత్వం

పిడుగుపాటు బాధితునికి రూ.20వేలు ఆర్థికసాయం

ఆర్థికసాయం అందిస్తున్న వెంకటరావు

ప్రజాశక్తి-సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి పంచాయతీ శివారు రావలమ్మ పాలెంలో ఈనెల19న పిడుగుపాటుకు18 మేకలు మృతి చెందిన ఘటనలో బాధితులు సబ్బి రమణ కుటుంబానికి గ్రామానికి చెందిన వైసిపి రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు రూ.20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సాయం చేసి ఆదుకోవడం ద్వారా తన దాతృత్వాన్ని మరోసారి చాటుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, యువకులు పాల్గొన్నారు.

పోటీల ముసుగులో సృజనాత్మకత మరువొద్దు

యువ ఉత్సవ్ ముగింపులో జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి- అనకాపల్లి : పోటీల ముసుగులో సృజనాత్మకత విలువలు మరవొద్దని అనకాపల్లి జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రావణ్‌కుమార్ హితవు పలికారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో గౌరీ గ్రంథాలయంలో 'యువ ఉత్సవ్-2023' ముగింపు వేడుకల్లో మాట్లాడుతూ, పోటీలు సృజనాత్మకత వెలికితీసేందుకు, ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవడానికి సహాయకారిగా నిలుస్తాయన్నారు. వివేకంతో కూడిన ఆలోచనా విధానంతో ముందుకు సాగితే ప్రతి వ్యక్తీ కోరుకున్న గమ్యాన్ని చేరుతారన్నారు. ప్రత్యేకమైన, అర్థవంతమైన మార్గాల్లో వ్యక్తీకరించడానికి స్వంతమైనదాన్ని సృష్టించడానికి పోటీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ సమన్వయకర్త జి.మహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎన్‌వైకె రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ, ఎపిఎస్ అల్లం రామప్రసాద్, నెహ్రూయువ కేంద్ర జాతీయ అవార్డు గ్రహీత

బహుమతులు అందజేస్తున్న డాక్టర్ శ్రావణ్‌కుమార్

ఆర్.లీలాప్రసాద్‌రెడ్డి, గౌరీ గ్రంథాలయ ఉపాధ్యక్షుడు కాండ్రేగుల జగ్గారావు, కాండ్రేగుల సత్యనారాయణ (ఎస్ఎఫ్ఐ.), కాండ్రేగుల శంకరబాబు పాల్గొన్నారు. అనంతరం యువశక్తి పెంపుదలలో భాగంగా పంచ ప్రాణాలు (అయిదు సంకల్పాలు) అంశంపై జిల్లా స్థాయిలో నిర్వహించిన వక్తృత్వ, యువ కళాకారులు, రచయితలు, ఫోటోగ్రఫీ, సాంస్కృతిక, సంప్రదాయక వారసత్వ ప్రదర్శన పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.

పూర్ణానందస్వామిని శిక్షించాలి

నిరసన వ్యక్తం చేస్తున్న పిడిఎస్ఒ ప్రతినిధులు

ప్రజాశక్తి- అనకాపల్లి : విశాఖ జ్ఞానానంద ఆశ్రమంలో బాలికను రెండేళ్లపాటు చిత్రహింసలకు గురిచేసి, అత్యాచారానికి పాల్పడిన పూర్ణానంద స్వామిని కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ(పిడిఎస్ఒ) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. భాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం గాంధీనగర్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అన్ని మత, ఆధ్యాత్మిక కేంద్రాలు, ఆశ్రమాలలో జరుగుతున్న అకృత్యాలపై విచారణకు కమిషన్ వేసి, తగు చర్యలు చేపట్టాలన్నారు. బాలికలు, మహిళలపై హత్యలు, అత్యాచారాలకు అరికట్టే చర్యల్లో భాగంగా సినిమా, టీవీ, పోర్న్ సైట్లలో వస్తున్న అభ్యంతరకర దృశ్యాలపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. విద్యాలయాలలోనూ, పని ప్రదేశాలలోనూ మహిళలను వేధింపులకు గురిచేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు.కార్యక్రమంలో సిహెచ్.జగదీష్ ,కె. శ్రీహరి, పాంగి ఉదయ్ కిరణ్,రాజారాం,పవన్, సిహెచ్ గణేష్,దిలీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వైసిపి మండల విస్తృత స్థాయి సమావేశం

ప్రజాశక్తి - పరవాడ: మండలంలోని వాడచీపురుపల్లి పంచాయతీ దలాయిపాలెంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వైసిపి మండల విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షులు కోన రామారావు తెలిపారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, ఎంపిపి పద్మలక్ష్మి శ్రీనివాస్, జెడ్‌పిటిసి పిఎస్.రాజు పాల్గొని, మండలంలో జగనన్న సురక్ష, గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమ, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షిస్తారన్నారు.

మండలంలోని అన్ని గ్రామాల్లోని వైసిపి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ఇతర ప్రజాప్రతినిధులతో పాటు నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మినీ గోకులం షెడ్ల బిల్లులు చెల్లించేదెన్నడో?

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని మినీ గోకులం షెడ్ల బిల్లులు చెల్లించక పోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. 2018-2019లో తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో రైతులకు మినీ గోకులం పథకం కింద షెడ్డు నిర్మాణంకు నిధులు మంజూరు చేశారు. దీనిలో భాగంగా రోలుగుంట మండలంలో 15 మంది రైతులు సొంతంగా షెడ్లు నిర్మించుకున్నారు. వారు ఒక్కొక్కరు షేరు ధనం కింద కొంత మంది 10వేలు, 15వేలు, మరికొంత మంది 18వేలు డిడి రపంలో బ్యాంకులో కట్టారు. తదనంతరం నిర్మాణ దశలో మెటీరియల్ బిల్లులు అందజేశారు. 2019లో ప్రభుత్వం మారింది. నిర్మాణం పూర్తయిన మినీ గోకులం షెడ్ల పూర్తిగా నిర్మించారు. ఇందుకు సంబంధించి బిల్లుల కోసం పశువైద్యాలయం చుట్టూ తిరిగారు. వైయస్సార్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అధికారులకు తమ గోడు వినిపించారు. వస్తాయని అధికారులు చెప్పడం కాళ్ళ అరిగేలా మినీ గోకులాల రైతులు తిరిగినా ఫలితం లేదు. రైతులు సొంత డబ్బులతో నిర్మించుకోగా సాయిబాలాజీ ఎంటర్ ప్రైజస్ వారు ఆ షెడ్లను కాంట్రాక్టుకు నిర్మించినట్లు అధికారులను నమ్మ బలికి ఆ నిధులు మార్చుకున్నట్లు రైతులు ఆరోపించారు. సాయి బాలాజీ ఎంటర్ ప్రైజెస్ వారి ఖాతాలో అమౌంట్ పడిందని, అధికారులు చెప్పినట్లు మండలంలోని రెడ్డి సత్యనారాయణ (ఎన్.కొత్తూరు), గంజి రాజారావు(కొండపాలెం), బంటు రమణ (కొండపాలెం) ఇలా 15 మంది రైతులు తెలిపారు. ఈ విషయమై తహశీల్దార్ కె.వరహాలుకు విజ్ఞప్తి చేయగా.. ఈ విషయాన్ని మండల ప్రత్యేకాధికారి బి.ప్రసాదరావు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై సర్వే నిర్వహించి రైతులకు న్యాయం మండల ప్రత్యేకాధికారి చేస్తామన్నారు.

కొండపాలెంలో ఉన్న మినీ గోకులం

కె.అడ్డసారంలో పిల్లర్ దశలో ఉన్న సచివాలయ భవనం

నిలిచిన సచివాలయ భవనాలు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలో మూడు సచివాలయ కేంద్రాల్లో సచివాలయ భవనాలు పునాదుల్లోనే దర్శనమిస్తున్నాయి. మండలంలో 16 సచివాలయ కేంద్రాలు ఉన్నాయి. కొన్ని కేంద్రాల్లో ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రారంభించారు. ఇప్పటికి మూడు కేంద్రాలు పునాదుల్లోనే ఉన్నాయి. ఎంకె.పట్నం, కొవ్వూరు, కె.అడ్డసరం గ్రామాల్లో పునాదుల్లోనే ఉన్నాయి. త్వరలో ఎన్నికలకు అన్ని పార్టీలు సిద్దమౌతున్నాయి. ఇటువంటి తరుణంలో నిర్మాణం జరుగుతుందని విమర్శలు మొదలయ్యాయి. బిల్లులు అవ్వక కొన్ని మధ్యలోనే ఉన్నాయి. మండల కేంద్రమైన రోలుగుంట మేజర్ పంచాయతీలో స్లాబ్ వేసి గోడలు నిర్మించారు. ఇంకా ప్లాస్టింగ్ జరగలేదు.

చేనేత మగ్గాల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి :నక్కపల్లిలో నేతన్న నేస్తం పథకం కింద దరఖాస్తు చేసుకున్న మగ్గాలను చేనేత శాఖ ఏడి మురళీకృష్ణ, డివో రమణమ్మ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లాలో గత ఏడాది నేతన్న నేస్తం పథకానికి 250 మగ్గాలకు అర్హత కలిగి ఉన్నాయన్నారు. ఈ ఏడాది 270 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 20 వరకు అనర్హత ఉన్నట్లు గుర్తించామన్నారు. అర్హులందరికీ నేతన్న నేస్తం పథకం కింద ఒక్కొక్కరికి రూ.24 వేల చొప్పున ఖాతాల్లోకి నగదు జమ చేస్తారన్నారు. సొసైటీ ఇన్చార్జ్ నాగబాబు, వార్డ్ మెంబర్ బంగారు రాజు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న అధికారులు

సర్వే చేపడుతున్న వాలంటీర్

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మున్సిపాలిటీ పరిధిలో 28వ వార్డు అయ్యన్న కాలనీలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో 28వ వార్డులో వైఎస్ఆర్సిపి నాయకురాలు గంటా లలిత ఆధ్వర్యంలో వార్డు వాలంటీర్లు ఇంటింటా సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా లలిత మాట్లాడుతూ, ఈనెల 24వ తేదీ నుండి వచ్చే జులై నెల 24వ తేదీ వరకు నెల రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ పథకం ద్వారా 11 రకాల సమస్యలు ఉచితంగా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రం, కొత్త రేషన్ కార్డు, ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు, హౌసింగ్‌లో సమస్యలు, రేషన్ కార్డులో మార్పులు చేర్పులు వంటి 11 రకాల సమస్యలను ఇంటి వద్దకే వాలంటీర్ ద్వారా తక్షణమే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్నికల అనంతరం రోడ్డు విస్తరణ

వైసిపి రూరల్ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు ప్రసాద్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం అబీద్ సెంటర్ నుండి బొడ్డేపల్లి వరకు విస్తరించనున్న రోడ్డు అనేక మలుపులు తిరుగుతుంది. ఎన్నికల అనంతరం రోడ్డు విస్తరణ చేపడుతున్నట్లు ఆల్ ఇండియా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైసిపి పార్టీ సీనియర్ నేత, రూరల్ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు పోతల ప్రసాద్ వెల్లడించారు. ఆదివారం సాయంత్రం స్థానిక కళ్యాణ మండపంలో భవన యజమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ, 2024 ఎన్నికల తర్వాతే నర్సీపట్నం మెయిన్ రోడ్డు విస్తరణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ రోడ్డు విస్తరణ 100 అడుగులకు కాకుండా 80 అడుగులకు మాత్రమే ఉంటుందన్నారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు మరో రెండు మూడు రోజుల్లో అధికారులకు అందుతాయని చెప్పారు. ఈ విషయమై ఇప్పటికే ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్చార్జ్ వైవి.సుబ్బారెడ్డిని కలవడం జరిగిందన్నారు. భవన యాజమానులతో కలిసి రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డిని కలిసి ఇక్కడ పరిస్థితిని వివరించామన్నారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించారని, దీన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు భవన యాజమానులను భయభ్రాంతులకు గురి చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో వైసిపి 175 కి 175 స్థానాలు గెలవడం ఖాయమని, అందులో నర్సీపట్నం మొదటి వరుసలో ఉంటుందని స్పష్టం చేశారు.

వారాహి యాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-మాడుగుల: పవన్ కల్యాణ్ చేపడుతున్న వారాహి యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ నేత రాయపురెడ్డి కృష్ణ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహిం టచిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ యాత్రపై ముద్రగడ పద్మనాభం ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మార్పు కోసం పవన్ కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహేష్, అజిత్, అచ్యుారావు, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కృష్ణ

జనసేనలో చేరికలు

గొలుగొండ:గొలుగొండ మండలం ఏఎల్‌పురం గ్రామంలోని వైసిపి పార్టీకి చెందిన దుంగల రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర సమక్షంలో పది మంది జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర పార్టీలో చేరిన దుంగల రమేష్‌తో పాటు మరో పది మందికి జనసేన కండువాలు వేసి సాదరంగా ఆహ్వానిం చారు. అనంతరం సూర్యచంద్ర మాట్లాడుతూ, జనసేన పార్టీ సిద్ధాంతాలు, పవన్‌కళ్యాణ్ ఆదేశాలకు ఆకర్షితులై రోజురోజుకు జనసేన పార్టీలో చేరికలు పెరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కేడిపేట ఉప సర్పంచ్ దుంపలపైడి సహదేవుడు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నగదును ఇస్తున్న పైలా ప్రసాదరావు

పది వేల ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలో వీరభద్రపేట పంచాయితీ శివారు గొప్పూరులో భోగుండమ్మ అమ్మవారి పండగ మహొత్సవం కార్యక్రమంనకు మాడుగుల నియోజకవర్గం తెలుగుదేశం నాయకులు పైలా ప్రసాదరావు రూ.10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, వీరభద్రపేట నుండి గొప్పూరు వరకు సరైన రహదారి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి ప్రాధాన్యతగా ఈ సమస్యలను పరిస్కరిస్తామని ప్రసాదరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగారపు పైడితల్లి, బడ్డు సత్తిబాబు, సింగారపు శివ, సింగారపు నాగరాజు, పల్లి రాజబాబు, పెదరాజు, చినరాజు, మాజీ సర్పంచ్ సబ్బవరపు గంగునాయుడు, వంటాకు కుమార్, మాజీ ఎంపిటీసీ కన్నూరు లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతోనే రోడ్డు నిర్మాణం

వైస్ ఎంపీపీ జక్కు నాగమణి

ప్రజాశక్తి-గొలుగొండ:ప్రజలకు మంచి చేయాలనే తపన, చిత్తశుద్ధి ఉంటే ఎంతటి పని అయినా సాధించవచ్చని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ నిరూపించారని గొలుగొండ వైస్ ఎంపీపీ జక్కు నాగమణి అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ 40 సంవత్సరాల పాటు పరిపాలించిన ప్రతిపక్ష నాయకుడు, సుదీర్ఘ కాలం మంత్రిగా చేయలేని పనిని కేవలం 30 నెలల్లో ఒక ఎమ్మెల్యేగా చేసి చూపించిన ఘనత ఎమ్మెల్యే గణేష్‌కే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వంలో రోడ్డు విస్తరణ కొరకు నిధులు మంజూరు చేయించినప్పటకి, ఆరిలోవ రిజర్వ్ ఫారెస్ట్‌లో అటవీశాఖ నుండి అనుమతులు తేలేక తెలుగుదేశం నాయకులు చెతులెత్తేశారని విమర్శించారు. తాము తెచ్చిన జీవోతోనే రోడ్డు విస్తరణ జరుగుతుందని టిడిపి నాయకులు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్ర అటవీశాఖ నుండి కేవలం 17 రోజుల్లోనే ఒత్తిడి తీసుకొచ్చి పూర్తిస్థాయి అనుమతులతో రోడ్డు పనులు ప్రారంభించిన ఘనకు ఎమ్మెల్యేకు దక్కుతుందని కొనియాడారు. 30 నెలల సమయంలో రోడ్డు విస్తరణకు కావలిసిన అటవీశాఖ భూమిని గుర్తించి, అందుకు బదులుగా పాకలపాడులో భూమిని అటవీశాఖకు బదలాయింపు చేయించి, అక్కడ అడవి అభివృద్ధికి ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డిచే స్వయంగా నిధులు మంజూరు చేయించి రోడ్డు విస్తరణకు కృషి చేసిన ఎమ్మెల్యే గణేష్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని ఆమె అన్నారు. పాత జీవోలు చూపించి ప్రజలను మభ్య పెట్టడం మానేసి ప్రజలకు వాస్తవాలు చెప్పి విస్తరణ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్‌ను పార్టీలకు అతీతంగా అభినందించాలని ఆమె కోరారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలోని 33/11కెవి కొరుప్రోలు సెక్షన్ పరిధిలోని ధర్మవరం సబ్ స్టేషన్ పరిధి ధర్మవరం, గెడ్డపాలెం గ్రామాల్లో ఈనెల 26న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈఈ గోపి తెలిపారు. ఆదివారం ఏఈ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మవరం సబ్ స్టేషన్ పరిధిలో 11కెవి నూతన లైన్ల నిర్మాణం చేపట్టినందున అనకాపల్లి డివిజనల్ ఇంజనీరు కె రాజశేఖర్ ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. సోమవారం ఉదయం 10గం నుండి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాధితులకు సహాయం

ప్రజాశక్తి -రోలుగుంట:మండలంలోని కొంతలంలో నిరుపేద కటుంబాలకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో సహాయం అందజేశారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే బాధిత కుటుంబానికి 25 కేజీల రైస్, ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఈ మేరకు తోమంద్ర నాగరాజు, రాయవరపు దేములమ్మ, పోతు దుర్గనాయుడులు మృతి చెందటంతో ఆయా కుటుంబానికి 25 కేజీల బియ్యం అందించారు.

ఐద్వా మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:స్థానిక కళ్యాణ మండపం వద్ద ఆదివారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నూతన మండల కమిటీని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి, జిల్లా కార్యదర్శి హైమావతిల సమక్షంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలుగా యస్.ఈశ్వరి, కార్యదర్శిగా ఎస్. విజయలక్ష్మిలను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులుగా మీనా, రాధమ్మ, లలిత, కుమారి, దేవిలను ఎన్నుకున్నారు.

గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి- చీడికాడ:ఆదివారం వచ్చిందంటే మండలంలోని అక్రమార్కులకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అక్రమంగా గ్రావెల్, మట్టి తవ్వకాలతో అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. చీడికాడ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం వచ్చిందంటే చాలు అధికారులు విధుల్లో ఉండరని తెలుసుకుని అక్రమంగా గ్రావెల్, మట్టి తవ్వకాలు జరిపి యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. ఈ విషయంపై గతంలో అనేకమార్లు పలు దినపత్రికల్లో ప్రచురించినా కూడా అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. మండలం కేంద్రంలో వైసిపి యువ నాయకుడిగా చెప్పుకుంటున్న జెసిబి ఓనర్ అక్రమంగా గ్రావెల్ మట్టి తవ్వకాలు జరిపి రవాణా చేస్తున్నారు. ఈ తవ్వకాలకు అధికారుల నుండి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా దర్జాగా అక్రమ మార్గంలో తవ్వకాలు జరిపి రవాణా చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఈ విషయాన్ని కొంతమంది పత్రికా విలేకరుల దృష్టికి తెచ్చారు. అక్రమ గ్రావెల్, మట్టి తవ్వకాలపై జెసిబి ఓనర్‌ని ప్రశ్నించగా తనకేం కాదని, అధికారులతో మాట్లాడు కున్నామని సమాధానం ఇచ్చారు. ఎంత అడిగినా అనుమతులు మాత్రం తీసుకున్నట్లు చెప్పలేదు. ఈ విషయంపై తహసిల్దార్ బి.వి.రాణిని ఫోన్లో వివరణ అడగ్గా.. తాము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్, మట్టి తవ్వకాలు జరిపిన జెసిబి ఓనర్ల పై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

పొక్లయినర్‌తో చేపడుతున్న తవ్వకాలు

టిడిపి నేతల భవిష్యత్తు కోసమే బస్సుయాత్ర

- ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:తెలుగుదేశం పార్టీ నేతల భవిష్యత్తు కోసమే బస్సు యాత్ర చేపడుతున్నారని, రాష్ట్ర ప్రజల కోసం కాదని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ విమర్శించారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, శనివారం నర్సీపట్నంలో జరిగిన సభలో అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. తెలుగుదేశం హయాంలో రాష్ట్రాన్ని దోచుకున్న దోపిడీ దొంగలు చంద్రబాబు నాయుడు, అయ్యన్నపాత్రుడేనని దుయ్యబట్టారు. టిడిపి ఏ బస్సు యాత్ర చేపట్టినా తమకు అభ్యంతరం లేదని, తమ పార్టీపై, పార్టీ నాయకులపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. 2014లో టిడిపి 600 హామీలు ఇచ్చి 60 హామీలు కూడా నెరవేర్చలేదని, ఇప్పుడు మరోసారి సరికొత్త హామీలతో భవిష్యత్తు గ్యారంటీ యాత్ర చేపడుతుందని హెద్దేవా చేశారు. వ్యవసాయదారులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి రైతాంగాన్ని మోసం చేశారన్నారు. డ్వాక్రా రుణమాఫీ అంటూ డ్వాక్రా మహిళలను మోసం చేశారని విమర్శించారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి వంటి హామీలు గుప్పించి యువతను మోసం చేశారన్నారు. నర్సీపట్నంలో ఎంత మందికి ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇచ్చారో చెప్పాలని సవాల్ విసిరారు. వృద్ధాశ్రమాలు కట్టిస్తామని వృద్ధులను, ఉచిత సైకిళ్లు ఇస్తామని హైస్కూల్ విద్యార్థులను, ఐప్యాడ్ ఇస్తామని కాలేజీ విద్యార్థులను, ఇంటింటికి మినరల్ వాటర్ ఇస్తామని గృహిణులను నమ్మించి మొండి చేయి చూపారన్నారు. సామాజిక పెన్షన్ల విషయంలో తెలుగుదేశం ఐదేళ్ల కాలంలో రూ.63వేలు ఇచ్చారని, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఐదేళ్ల కాలానికి 1లక్షా 48వేల 500 ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన ప్రతి ఏటా అందిస్తున్నామన్నారు. నాలుగేళ్ల కాలంలో 98 శాతం హామీలు నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమన్నారు. మరో 30 ఏళ్ల ఆయనే ముఖ్యమంత్రిగా ఉంటారన్నారు. వచ్చే ఎన్నికల్లో అయ్యన్నపాత్రుడుకు ప్రజలు మరోసారి గట్టిగా బుద్ధి చెబుతారన్నారన్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి గాలికి..

-భవిష్యత్ గ్యారెంటీ బస్‌యాత్రలో మాజీ మంత్రి అయ్యన్న

ప్రజాశక్తి- చోడవరం : నాలుగేళ్ల వైసిపి పాలనలో అభివృద్ధిని గాలికొదిలేశారని తెలుగుదేశం పోలీస్ బ్యూరో సభ్యులు మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు మండిపడ్డారు. ఆదివారం చోడవరంలో మీ భవిష్యత్తుకు మా గ్యారంటీ బస్సు యాత్రలో భాగంగా స్థానిక కాలేజ్ గ్రౌండ్‌లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేసిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి శిలాఫలకం వద్ద సవాల్ విసిరారు. ఏళ్ల గడుస్తున్నా శిలాఫలకమే తప్ప పనులు పూర్తి కాలేదన్నారు. చోడవరం నియోజకవర్గంలో రోడ్లన్నీ అధ్వాన్నస్థితికి చేరుకున్నా నాలుగేళ్లలో ఒక్కటైనానిర్మించిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ నియోజకవర్గ అభివృద్ధిని గాలికొదిలేశారని ఆరోపించారు. ముందుగా బుచ్చయ్యపేట మండలం నుండి వస్తున్న బస్సు యాత్రకు గౌరీపట్నం రోడ్డు వద్ద టిడిపి శ్రేణులు ఘన స్వాగతం పలికి, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే రాజు, టిడిపి జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగ జగదీశ్వరరావు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి మల్లునాయుడు, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షులు వంగలపూడి అనిత, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళా వెంకటరావు, పప్పల చలపతిరావు, బండారు సత్యనారాయణ, మండల టిడిపి నాయకులు కనిశెట్టి సన్యాసిరావు, జి వెంకట సత్యనారాయణ, బొడ్డేడ నాగగంగాధర్ పాల్గొన్నారు.

అసమర్థత ఎమ్మెల్యేను ఓడించాలి

కొత్తకోట:స్థానిక అసమర్థత ఎమ్మెల్యేను ఓడించ కుంటే చోడవరం నియోజకవర్గం అభివృద్ధి మరో పదేళ్ల వెనక బడుతుందని మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడు విమర్శించారు.రావికమతం మండలంలో టిడిపి నిర్వహించిన భవిష్యత్ గ్యారంటీలో భాగంగా కొత్తకోట, రావికమతం గ్రామాలలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అయ్యన్న మాట్లాడుతూ, రాబోవు ఎన్నికల్లో ఓడించాలని పిలుపు నిచ్చారు. పాలన పై ప్రశ్నించే వారిపై కేసులు పెట్టి బెదిరిస్తున్నారన్నారు.బివిన్ రోడ్డు గత కొంత కాలంగా గోతుల మయంగా మారినా అభివృద్ధి చేయలేని స్థితిలో వైసిపి ఎమ్మెల్యే ఉన్నారని, రియల్ ఎస్టేట్ వ్యాపారం మోజులో ఉన్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి పప్పల చలపతిరావు, సుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ మల్లునాయుడు, టిడిపి మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి గోవిందరావు, టిడిపి మండల శాఖ అధ్యక్షులు రాజాన కొండ నాయుడు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిక

కొత్తకోట జనసేన పార్టీకి చెందిన పలువురు వార్డు సభ్యులు, కార్యకర్తలు టిడిపిలో చేరారు. గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు గట్రెడ్డి శ్రీనివాసరావు, ప్రస్తుత 11వ వార్డు సభ్యులు భీమరాతి సత్యనారాయణ దంపతులతో పాటు మరో కొంత మంది కార్య కర్తలు మాజీ ఎమ్మెల్యే రాజు సమక్షంలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు..

రోలుగుంట:మండలంలోని కొండపాలెం శివారు గ్రామమైన వెలంకాయలపాలెం గ్రామానికి బస్సు యాత్ర చేరింది.అనంతరం ర్యాలీగా కొత్తకోట మీదుగా రావికమతం వెళ్లింది.

ప్రజల సమస్యలను పట్టించుకోరా..?

-బంగారుమెట్ట ఎత్తిపోతల పథకం వద్ద సెల్ఫీ ఛాలెంజ్

వడ్డాది : సంక్షేమం పేరుతో ప్రజలకు చిల్లర పైసాలు ముట్టజెప్పి, ప్రధానమైన సమస్యల పరిష్కారంలో సిఎం జగన్, ఎమ్మెల్యే ధర్మశ్రీ, నిర్లక్ష్యం చేశారని మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు మండిపడ్డారు. 'మీ భవిష్యత్ మా గ్యారెంటీ' ప్రచారంలో భాగంగా బంగారుమెట్ట ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పథకం ఎప్పటికి పూర్తిచేస్తారంటూ సెల్ఫీ చాలెంజ్ చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ టిడిపి హయాంలో 90 శాతం పనులు .జరిగిన ఎత్తిపోతల పథకం ఏవో కారణాలతో ఆగిపోతే, పూర్తిచేసేందుకు నాలుగేళ్లలో ఏంచ ర్యలు చేపట్టారో చెప్పాలని ప్రశ్నించారు టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామన్నారు. భీమునిపట్నం నర్సీ పట్నం రోడ్డులోని గుంతలు ప్రభుత్వ విప్ ధర్మశ్రీకి కనిపించడం లేదాయని ఎద్దేవా చేశారు. టిడిపి హయాంలో తుని నుంచి సబ్బవరం వరకు వయా నర్సీపట్నం, చోడవరం మీదుగా జాతీయ రహదారి నిర్మాణానికి ప్రతిపాదించామని, చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలో పెండింగ్‌లో ఉన్న ఆ ఫైల్‌ను పూర్తిచేయాలన్నారు. అనంతరం వడ్డాది చెరుకు కాటా వద్ద రైతులతో ముఖాముఖి నిర్వహించారు. వడ్డాది వంతెన పడిపోయి రెండేళ్లవుతున్నా పట్టించుకునే దిక్కులేదని మండిపడ్డారు. దీని వల్ల సుగర్ ఫ్యాక్టరీ మూతబడే పరిస్థితి ఉన్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో చోడవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు, చింతకాయల అయ్యన్నపాత్రుడు పీలా గోవిందత్యనారాయణ, మాజీ సర్పంచ్ తమరన దాసు. యల్లపు జగ్గారావు పాల్గొన్నారు

ఎత్తిపోతల పథకం వద్ద మాట్లాడుతున్న అయ్యన్న

బుచ్చయ్యపేట : తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో భవిష్యత్తు గ్యారెంటీ బస్సు యాత్ర ఆదివారం బుచ్చయ్యపేట మండలంలోకి ప్రవేశించింది. మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, బండారు సత్యనారాయణమూర్తి, పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కెఎస్ ఎన్ ఎస్ రాజు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు అమరపురి జ్యోతిర్మయి బాబా ఆలయం వద్ద పూజలు నిర్వహించారు. భోజన విరామం తర్వాత యాత్ర ప్రారంభమైంది.

400 కిలోల గంజాయి స్వాధీనం

-వాహన ప్రమాదంతో పట్టుబడిన వైనం

ప్రజాశక్తి-పాడేరు:పాడేరు ఘాట్లో ఆదివారం ఉదయం జరిగిన వాహన ప్రమాదంతో భారీగా రవాణా చేస్తున్న గంజాయి గుట్టు రట్టయింది. దీని వివరాలు ఇలా ఉన్నాయి. పాడేరు నుంచి మైదాన ప్రాంతాలకు సుమారు 400 కిలోల గంజాయి వేసుకొని వెళుతున్న మహీంద్రా ఎక్స్ యువి వాహనం ఆదివారం ఉదయం పాడేరు మండలంలోని మినుములూరుకు సమీపంలో ఉన్న పోతురాజు గుడి వద్ద ఒక మలుపులో ఎదురుగా వస్తున్న ట్యాంకర్ లారీని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంతో గంజాయి తరలిస్తున్న వాహనం ముందు బాగమంతా గట్టిగా దెబ్బతిని మొరాయించింది. ఈ వాహనం కదలక పోయే సరికి గంజాయి తరలిస్తున్న స్మగ్లర్లు వాహనాన్ని అక్కడే విడిచి పరారయ్యారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా బస్తాలతో ఉన్న గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వెంటనే వాహనంలో ఉన్న గంజాయిని పోలీస్ స్టేషన్కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పాడేరు పోలీస్ ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. ఈ వాహనంలో ఇంకా వేరువేరు రాష్ట్రాల పేరుతో ఉన్న వాహనం నెంబర్ ప్లేట్లను పోలీసులు కనుగొన్నారు. మన్యం నుంచి భారీగా గంజాయి రవాణా చేస్తున్న ముఠా గుట్టు రట్టు చేసేందుకు పోలీసులు ఆరా తీస్తున్నారు.